
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 10, మే 2025



మార్కాపురం వాసులకు నీటి కష్టాలు తీరే దారి కనిపించడం లేదు. ప్రస్తుతం వారం, పది రోజులకు కూడా నీరివ్వలేని దుస్థితి నెలకొంది. అందుకు సాగర్ పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడమే కారణమైంది. రూ.4.7కోట్లతో దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లి జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయాల్సిన పైప్‌లైన్ పనులు ఏడాదిన్నరగా నిలిచిపోయాయి. ప్రధాన కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్‌ల మధ్య తలెత్తిన బిల్లుల చెల్లింపు వివాదం ప్రజలకు శాపంగా మారింది. పనిని త్వరగా పూర్తి చేయించాల్సిన ప్రజారోగ్య శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. కనీసం కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చేందుకు కూడా చొరవ చూపడం లేదు.

నీళ్లున్నా.. ఇక్కట్లే!



నీటితో కళకళలాడుతున్న దూపాడు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు

వారంలో పనులు పునఃప్రారంభం

ఏడాదిన్నరగా దూపాడు-బోడిరెడ్డిపల్లి జంక్షన్ల మధ్య 1.5 కిలోమీటర్ల మేర ఆగిపోయిన సాగర్ పైపులైన్ పనులను మరో వారంరోజులలో కాంట్రాక్టర్ ప్రారంభించనున్నాడు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు మాట్లాడాను. కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. జూన్ మొదటి వారానికల్లా పనులు పూర్తయ్యేలా చూస్తాం.

\- నారాయణరావు, మునిసిపల్ కమిషనర్

కాంట్రాక్టర్‌ల మధ్య జగడం
మార్కాపురం పట్టణ ప్రజలకు శాపం

- సాగర్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయని వైనం
- దూపాడు-బోడిరెడ్డిపల్లి మధ్య నిలిచిన పనులు
- త్వరగా చేయకుంటే తాగునీటికి ఇబ్బందే



నిలిచిపోయి ఉన్న పైప్‌లైన్ పనులు

మార్కాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ వాసుల దాహార్తిని తీర్చేది సాగర్ నీటి పథకమే. త్రిపురాంతకం మండలం దూపాడు నుంచి 28 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగితే పుర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. గత కొన్నేళ్లుగా ఓ కీలకమైన పని పెండింగ్‌లో ఉండటంతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిండా నీళ్లు ఉన్నా సక్రమంగా తాగునీటిని అందించలేని దుస్థితి నెలకొంది. వాస్తవానికి మూడు రోజులకొకసారి పట్టణ ప్రజలకు సాగర్ నీటిని అందించాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వారం పదిరోజులకొకసారి ఇస్తున్నారు. సాగర్ పైప్‌లైన్ పనులు పూర్తికాకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల మధ్య బిల్లుల చెల్లింపుల విషయంలో ఏర్పడిన వివాదమే ఇందుకు కారణం.

2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మార్కాపురం పట్టణానికి సాగర్ నీటిని అందించేందుకు రూ.45కోట్లతో దూపాడు నుంచి మార్కాపురం వరకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టింది. అప్పట్లో మొత్తం 28 కిలోమీటర్లకుగాను దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లె జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేర ప్రయోగాత్మకంగా జీఆర్‌పీ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి మార్కాపురం వరకు 24.5 కిలో మీటర్ల వరకు డీఐ పైప్‌లైన్ వేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు దశాబ్ద కాలంపాటు ఆ 3.5 కిలోమీటర్ల పరిధిలోనే నెలకు రెండుసార్లైనా లీకులు ఏర్పడేవి. దీంతో మరమ్మతుల ఖర్చులు మునిసిపాలిటీకి తలకుమించిన భారమైంది. ఈనేపథ్యంలో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పాతదాని స్థానే నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు టెండర్లు పిలిచింది. ఎన్నికలకు ముందు కావడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. తదనంతరం 2022లో వైసీపీ హయాంలో మళ్లీ ఈ పనికి టెండర్లు పిలిచింది. ఏవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ పనులను దక్కించుకుని వేరొకరికి సబ్ కాంట్రాక్ట్ ఇచ్చింది. కాంట్రాక్టర్ మాత్రం బిల్లులు పడడం లేదనే కారణంతో మూడేళ్ల కాలంలో ఇప్పటికి రెండు కిలోమీటర్ల మేర మాత్రమే పైప్‌లైన్ వేశారు. ఒప్పందం ప్రకారం ఆరు నెలల్లో ఆ పనిని పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇంకా 1.5 కిలోమీటర్ల మేర పని పెండింగ్‌లో ఉంది.

పైప్‌లైన్‌తోనే సమస్య అంతా

పైప్‌లైన్ పనులను 2022లో ప్రారంభించిన సబ్ కాంట్రాక్టర్ మొదటి నుంచి నత్తనడకనే సాగించారు. అప్పటివరకు చేసిన 2 కిలోమీటర్ల పనికి 2024 సాధారణ ఎన్నికలకు మూడు మాసాల ముందు రూ.2కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. మిగిలిన 1.5 కిలోమీటర్ల మేర పనులు గట్టిగా చేస్తే నెలరోజుల్లోనే పూర్తయ్యేవి. కానీ ఆ దిశగా సబ్ కాంట్రాక్టర్ చొరవ చూపలేదు. ప్రధాన కారణం కాంట్రాక్టర్ ఏవీఆర్ ఇన్‌ఫ్రా యజమాని అయిన ఓ మాజీ ఎమ్మెల్యే 2024 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసినప్పుడు బిల్లులు వాడుకున్నారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. పనిచేసింది సబ్ కాంట్రాక్టర్ అయినా బిల్లులు ప్రధాన కాంట్రాక్టర్ వాడుకోవడంతోనే పనులను నిలిపివేసినట్లు తెలిసింది. వారి మధ్య బిల్లుల లెక్కలు తేలకపోవడంతోనే నేటికీ పనుల్లో ఎలాంటి పురోగతి లేదని సమాచారం. వాస్తవానికి సబ్ కాంట్రాక్టర్ ప్రస్తుత ప్రభుత్వ నాయకుడైనా కీలకమైన ఈ పనిని పూర్తి చేయకపోవడంతో ప్రజలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

కాంట్రాక్టర్ల మధ్య బిల్లుల గొడవతోనే జాప్యం



ఉదయ్‌కృష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్థులు

అకుంఠిత దీక్షతో ప్రయత్నిస్తే విజయం తథ్యం

సివిల్స్ ర్యాంకర్ ఉదయ్‌కృష్ణారెడ్డి

స్వగ్రామం ఊళ్లపాలెంలో ఘనంగా పౌరసన్మానం

సింగరాయకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి) : నిర్ధిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకొని అంకుఠిత దీక్షతో అలుపెరుగని కృషిచేస్తే విజయం తథ్యమని సివిల్స్ ర్యాంకర్ మూలగాని ఉదయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 350వ ర్యాంకు సాధించిన అనంతరం ఆయన శుక్రవారం తొలిసారి స్వగ్రామమైన ఊళ్లపాలెంకు వచ్చారు. గ్రామస్థులు సింగరాయకొండ నుంచి ఊళ్లపాలెం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పౌర సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉదయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టిన తాను ఐపీఎస్ స్థాయికి చేరుకోవడానికి వివిధ దశల్లో ఉపాధ్యాయులు నేర్పిన విద్య, శ్రేయోభిలాషులు, స్థానికులు చేసిన సూచనలు, సలహాలు ఉపయోగపడ్డాయని తెలిపారు. సివిల్స్ సాధించేందుకు పదేళ్లపాటు నిర్విరామంగా కష్టపడ్డానని వివరించారు. తన నాయనమ్మ రమణమ్మ గ్రామంలో కూరగాయలు అమ్మి తనను, తన సోదరుడిని చదివించిందని గుర్తుచేసుకున్నారు. ఆమె దగ్గర గ్రామస్థులు కూరగాయలు కొనుగోలు చేసి ఒకరకంగా తాము చదువుకోవడానికి ఆర్థికంగా అండగా నిలిచారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎమర్జెన్సీ వస్తే 108 అంబులెన్స్ ఉన్నట్లే జంతువులకు కూడా 109 సర్వీసులు తెచ్చి అత్యవసర సేవలందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్థులు ఉదయ్‌కృష్ణారెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు.

మరో ఎద్దుపై పెద్దపులి పంజా

- చంపి అడవిలోకి లాక్కెళ్లిన వైనం
- రెండు నెలల్లో 5 మృత్యువాత

7



పెద్దపులి దాడిలో మృతి చెందిన ఎద్దు



పారదర్శకంగా టీచర్ల బదిలీలు

- ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే
- ప్రాధాన్యత కేటగిరీల్లో కోత
- ఖాళీలపై కసరత్తు

ఒంగోలు విద్య, మే 9 (ఆంధ్రజ్యోతి) : త్వరలో ప్రారంభంకానున్న ఉపాధ్యాయుల బదిలీలను చట్ట పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అడ్డగోలు, అక్రమ బదిలీలకు అడ్డుకట్ట వేస్తూ విద్యాశాఖ చరిత్రలో ప్రప్రథమంగా ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం-25ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రతిపాదికనే ప్రస్తుతం టీచర్ల బదిలీలు నిర్వహించనున్నారు. బదిలీ దరఖాస్తు, స్థానాల ఎంపిక, కేటాయింపు ఇలా మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తారు. విద్యా సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. జూన్ 1నుంచి మే 31వరకు విద్యా సంవత్సరంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరంలో ఒక పాఠశాలలో 9 నెలల సర్వీసు పూర్తయితే ఒక అకడమిక్ ఇయర్ సర్వీసుగా లెక్కిస్తారు. కనీసం రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు. ఒకే పాఠశాలలో హెచ్‌ఎంగా ఐదు సంవత్సరాలు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసిన ఇతర ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే.

ప్రాధాన్యత కేటగిరీల్లో కోత

ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో గతంలో అవకాశం ఇచ్చిన కొన్ని అంశాలను ప్రస్తుతం పక్కన పెట్టారు. గతంలో వితంతువులు, విడాకులు తీసుకున్న వారు, మాజీ సైనికోద్యోగులు, సైనికోద్యోగుల స్పౌజ్‌లు, 70శాతంతో శారీరక, ఇతర వైకల్యం ఉన్న వారిని ప్రాధాన్యత కేటగిరీ కింద పరిగణించే వారు. కానీ ఈసారి వీరికి ప్రత్యేక పాయింట్లు మాత్రమే కేటాయిస్తారు. 70శాతంపైన వైకల్యం ఉన్న వారు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారు, వ్యాధిగ్రస్థులైన పిల్లలు ఉన్న వారిని మాత్రమే ప్రాధాన్యత కేటగిరీలో బదిలీ చేస్తారు. స్పౌజ్ కేటగిరీ, ఎన్‌సీసీ, స్కౌట్స్, జిల్లాస్థాయి గుర్తింపు పొందిన సంఘాల నాయకులకు కూడా బదిలీల్లో పాయింట్లు కేటాయిస్తారు. బదిలీలకు సంబంధించి ఎవ్వరూ కోర్టుకు వెళ్లరాదు. ప్రాధాన్యత కేటగిరీలో బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు 40శాతం, సబ్జెక్టు టీచర్లు అయితే 50శాతం మాత్రమే ఒక పాఠశాలకు అనుమతిస్తారు. ఒక హైస్కూల్‌లో ప్రతి సబ్జెక్టులో సింగిల్ టీచర్ పోస్టు ఉంటే దానికి ప్రాధాన్యత కేటగిరీలోని టీచర్లను నియమించరు.

ఖాళీలను గుర్తించేందుకు ఎనిమిది బృందాలు

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రకటించే ఖాళీలను గుర్తించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. అందుకోసం ప్రత్యేకంగా ఎనిమిది బృందాలను ఏర్పాటు చేసింది. వీరు మండలాల వారీ జాబితాలను పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంది. స్థానిక డీఆర్‌ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్‌లో ఈ బృందాలు శుక్రవారం పరిశీలన ప్రారంభించాయి. ప్రతి బృందానికి ఏడు మండలాలు కేటాయించారు. మండల విద్యాధికారులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన బృందం వద్దకు వెళ్లి పాఠశాలల వారీగా తమ మండలంలోని ఖాళీల వివరాలను వివరించి ఆమోదముద్ర పొందాల్సి ఉంటుంది. అనంతరం ఐటీ సెల్‌కు వివరించి వారు కూడా ఆమోదముద్ర తెలిపాక ఖాళీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. త్వరలో బదిలీల ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.



పవన్ కల్యాణ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

కానిస్టేబుల్ కల్యాణ్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

మావోయిస్టుల దాడిలో మృతిచెందిన పీసీపల్లి మండలం ముద్దపాడు గ్రామానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ నూగతోటి పవన్‌కల్యాణ్‌కు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పలువురు పోలీసు అధికారులు, ప్రజలు కల్యాణ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

వివరాలు మెయిన్‌లో..

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి
- ప్రతిపాదిత ప్రాంతం పరిశీలన
- నిర్మాణ ఆవశ్యకతను వివరించిన టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

7

రెండో బ్రిడ్జికి నిధులిస్తాం



బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకతను మంత్రి జనార్దన్‌కు వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

రైస్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

- రెండు రోజుల్లో 2,051 దాఖలు
- వాటిలో మెంబర్ యాడింగ్ కోసం 1,431
- కొత్తవాటి కోసం మరో 393

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రైస్ కార్డుల కోసం దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. అర్హులైన వారికి కొత్త రైస్ కార్డులతోపాటు ఉన్న వాటిలో చేర్పులు, మార్పులు, తొలగింపులకు అవకాశం ఇవ్వడంతో ప్రజలు గ్రామ, వార్డు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. గురు, శుక్రవారాల్లోనే 2,051 దరఖాస్తులు వచ్చాయి. అందులో కొత్త రైస్ కార్డుల కోసం 393 అందాయి. ప్రస్తుతం ఉన్న రైస్ కార్డుల్లో మెంబర్ యాడింగ్ (చేర్పుల) కోసం అత్యధికంగా 1,431 వచ్చాయి. రేషన్ కార్డుల్లో తప్పుల సవరణ, కార్డుల్లో ఎవరైనా ఉండి చనిపోతే వారి పేరు తొలగింపు కోసం కూడా దరఖాస్తులు వస్తున్నాయి.

పరిశ్రమల రాయితీకి రూ.5కోట్లు మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు సంబంధించి 154 క్లెయిమ్స్‌కు రూ.5కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్ణయం తీసుకున్నారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆమె పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం 112 దరఖాస్తులు చేసుకోగా వివిధ శాఖల చెందిన 102కు ఆమోదం తెలిపారు. మిగిలిన పది దరఖాస్తులను త్వరగా ఆమోదించాలని కలెక్టర్ సూచించారు. పీఎంఈజీపీ పథకం అమలులో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. ఈ పథకం లబ్ధిదారులు ఎలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తారన్నది సమీక్షించి దిశానిర్దేశం చేశారు. పీఎంఈజీపీ పథకం కింద బ్యాంకులు తిరస్కరించిన దరఖాస్తులను పరిశీలించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీనియారిటీ జాబితాలు సిద్ధం

- రెండు రోజుల్లో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు ఉత్తర్వులు

ఒంగోలు విద్య, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు సిద్ధంగా ఉన్నట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు తెలిపారు. రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. శుక్రవారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో కమిషనర్ మాట్లాడారు. ప్రమోషన్లకు ఒక పోస్టుకు ఇద్దరి నుంచి అంగీకారం తీసుకొని ఆన్‌లైన్‌లోనే ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ప్రమోషన్లు, బదిలీల ద్వారా ఒక పాఠశాలలో 50శాతానికి పైగా టీచర్లు రిలీవ్ కావాల్సి వస్తే మెగా డీఎస్సీ సెలక్షన్స్ జరిగి కొత్త టీచర్లు వచ్చే వరకు ఆ పాఠశాలలోనే పనిచేయాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా పూర్తయినందున దానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా విడుదల చేస్తామని కమిషనర్ చెప్పారు.

భూసేకరణ పూర్తికి కార్యాచరణ : జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ మొదటి దశ పూర్తి చేసేందుకు ఈనెల 15వ తేదీలోపు కార్యాచరణ రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఆయా సంబంధించిన అంశాలపై శుక్రవారం ప్రాజెక్టు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మాట్లాడారు. అసైన్డ్‌మెంట్ భూములకు సంబంధించి ఈనెల 30లోపు పూర్తి నివేదికను అందజేయాలన్నారు. మార్కాపురం, కంభం యూనిట్లలో గ్రామసభలు నిర్వహించి ఆయా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఇళ్ల పట్టాలు, కాలనీల్లో మౌలికసదుపాయాల కల్పన కోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయా పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

చీమకుర్తిలో చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చీమకుర్తి, మే9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవిలో ప్రజల సౌకర్యార్థం పురపాలకసంఘం ఆధ్వర్యంలో చీమకుర్తి పట్టణంలోని మూడు ప్రధాన కూడళ్ల వద్ద శుక్రవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మెయిన్‌రోడ్, పాత బీసీ హాస్టల్, మసీద్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావుల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తోపుడుబండి అందజేత

ఒంగోలు(కల్చరల్), మే 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌కు చెందిన శెట్టి ప్రమీల జీవనోపాధి నిమిత్తం సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ పండ్ల తోపుడుబండిని అందజేశారు. మండవ నటరాజ్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఈ బండితో జీవనోపాధి పొందాలని ఆయన కోరారు. తమ ట్రస్ట్ వైద్య, విద్య, జీవనోపాధి తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారులు మండవ సుబ్బారావు, కార్యదర్శి సర్దార్‌బాష పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌వోల సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని పలువురు స్పష్టం చేశారు. సీహెచ్‌వోలు స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత 11 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత ఏడేళ్ళ నుంచి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నా ప్రభుత్వం తమపై కనికరంచూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, జయశ్రీ, రమేష్, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఊరేగుతున్న స్వామివారు

నాగులుప్పలపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం దేవాలయంలో గరుడ పట పూజ, ధ్వజారోహణ నిర్వహించారు. రాత్రి దేవస్థాన ఈవో పచ్చవ రామకృష్ణారావు, పూజారి దీవి శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో స్వామి వార్లను నృసింహావతారంలో అలంకరించి సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అంధులకు నైపుణ్యాలపై ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని అంధులకు వృత్తి, సామాజిక జీవితంలో అవలంబించాల్సిన నైపుణ్యాలపై మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నయ్‌లోని అంధుల జాతీయ సాధికార సంస్థ ఈ శిక్షణ ఇస్తుందన్నారు. 2025-26 సంవత్సరంలో మూడు బ్యాచ్‌లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజనం ఉచితంగా అందజేయటంతో పాటు ప్రత్యేక భృతి కూడా ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాల్లోని అంధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు నగరం, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షపై ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడినతరగతుల సంక్షేమశాఖాధికారి, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు అంజల కోరారు. ఈ శిక్షణ కోసం ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలన్నారు. టెట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. వివరాలకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

కారును ఢీకొన్న టిప్పరు.. ఒకరికి గాయాలు

మార్టూరు, మే9 (ఆంధ్రజ్యోతి): మార్టూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న హైవేపైఒంగోలు వైపు వెళుతున్న కారును వెనుక నుంచి టిప్పర్ ఢీకొన్న సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి వెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బండారు వెంకటేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి. అతను స్వస్థలం పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు. జొన్నతాళి గ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

● రైతు సంఘం డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న జయంతిబాబు

నాగులుప్పలపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. బర్లీని పొగాకు కంపెనీలు కొనుగోలు చేయాలని కోరుతూ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ప్రైవేటు కంపెనీలు రైతులను ప్రోత్సహించి బర్లీ పొగాకు సాగు చేయించారన్నారు. ఉత్పత్తి ఎంత ఉన్నా కొనుగోలు చేస్తామని నమ్మబలికి తీరా పంట చేతికి వచ్చేసరికి కుంటి సాకులు చెబుతూ రైతులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను నిల్వ చేసుకొనే మార్గం లేక బర్లీ రైతులు అనేక ఇబ్బందులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కంపెనీలతో బర్లీ పొగాకు కొనుగోలు చేయించడంతో విఫలమైందని ఆరోపించారు. కంటి తుడుపు మాటలతో సరిపెడుతుందే తప్పా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బర్లీ రైతుల సమస్యలను పరిష్కరించలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించి బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు, పాలపర్తి యోనా, హజరత్తయ్య, మండవ ఆంజనేయులు, పలు గ్రామాల బర్లీ రైతులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో న్యూరో శస్త్రచికిత్స విజయవంతం

● ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఏడుకొండలరావు



ఆసుపత్రిలో వివరాలను వెల్లడిస్తున్న సూపరింటెండెంట్ ఏడుకొండలరావు, వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో వెన్నెముక, న్యూరో ఆపరేషన్ విజయంతంగా చేసినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. శుక్రవారం స్థానిక జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగులుప్పలపాడు మండలం రాపర్ల-మాచవరం గ్రామానికి చెందిన వ్యక్తికి తలభాగం నుంచి వెన్నెముక వైపు వెళ్ళే నరంపై గడ్డ వచ్చింది. దీంతో బాధితుడు ఏడాదిః కాలంగా అనేక ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాలేదన్నారు. అయితే చివరకు ఆయన జీజీహెచ్‌కు విచ్చేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి బాధితుడికి సీ3, సీ4 ట్యూమర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే ఎంతో ఖరీదైన, క్లిష్టతరమైన ఆపరేషన్ అయినప్పటికీ జీజీహెచ్ న్యూరో సర్జరీ వైద్యులు విజయంతంగా నిర్వహించినట్లు చెప్పారు. వాస్తవానికి ఆసుపత్రిలో ఉన్న వనరులు, వైద్య పరికరాలతో న్యూరో సర్జరీ స్పెషలిస్ట్ వైద్యులు గోపి, మురళీకృష్ణ, వలీ సంయుక్తంగా అరుదైన ఆపరేషన్ చేయడంతో రోగి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. జీజీహెచ్‌లో మెరుగైన శస్త్రచికిత్సలు చేస్తున్నామని, ప్రజలు ఆయా సేవలను వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలి



చీమకుర్తిలో మాట్లాడుతున్న ఈఆర్వో వరకుమార్



కొండపిలో మాట్లాడుతున్న ఈఆర్వో కుమార్

● ఈఆర్వో వరకుమార్

చీమకుర్తి, మే9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వరకుమార్ కోరారు. శుక్రవారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, పలు పార్టీల ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్‌కు ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల నమోదు, సవరణలు గురించి చర్చించారు. అన్ని పార్టీల బీఎల్‌ఏలు స్వచ్ఛీకరణలో పాల్గొంటున్న బీఎల్‌వోలతో సహకరించటంతో ప్రక్రియ విజయవంతం కావటానికి తగు సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు. సమావేశంలో తహసీల్దార్లు ఆర్.బ్రహ్మయ్య, వి.ఆదిలక్ష్మి, ఎస్ఎల్.నారాయణరెడ్డి, డీటీ వాసుదేవరావు, పార్టీల ప్రతినిధులు గొల్లపూడి సుబ్బారావు, పమిడి వెంకటేశ్వర్లు, వేమా శ్రీనివాసరావు, తాతినేని రాము, దరిమడుగు నాగరాజు, తుమ్మల సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

98శాతం ఆధార్‌తో అనుసంధానం

కొండపి: నియోజకవర్గంలోని ఓటర్ కార్డులకు 98శాతం ఆధార్ అనుసంధానం పూర్తయిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం అనంతరం నియోజకవర్గంలోని 161 మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈసీ ఆదేశాల మేరకు వాటిని ఒకచోట తొలగించామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు పి. మురళి, పుల్లారావు, జనార్దన్‌రావు, ఎం.జ్వాలానరసింహం, జి.ఆంజనేయులు, సింగరాయకొండ డిప్యూటీ తహసీల్దార్ ముస్తాక్, ఎలక్షన్ డీటీ పి.సురేఖ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మార్వై ఎం.శ్రీనివాసరావు, తాటాకులపాలెం సర్పంచ్ షేక్ వన్నూరు, టీడీపీ నాయకులు యనమద్ని వెంకటేశ్వర్లు, అనుమాల ప్రసాద్, లేళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం

● పరిశీలించిన కార్పొరేటర్



ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వేణుగోపాల్

ఒంగోలు కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం సుజాతనగర్‌లోని రోడ్డు విస్తరణ, సైడు కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం పలికారు. గత కొన్నేళ్ళుగా ఆ రోడ్డు మార్గం ఇరుకుగా ఉండటంతోపాటు, డ్రైనేజీ ప్రధాన సమస్యగా మారింది. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక సమతా నగర్ నుంచి తాలూకా పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపుతోపాటు, సైడు కాలువల నిర్మాణానికి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా సుజాతనగర్‌లో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటి పరిష్కారం కోసం ప్రత్యేకచర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రోడ్డు విస్తరణ, సైడు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే సుజాతనగర్‌వాసులు కూడా చేపట్టిన అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు.

12న కడవకుదురులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

చినగంజాం, మే 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామదేవత పోలేరమ్మతల్లి తిరునాళ్లను పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీ ఉదయం 9గంటలకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.5,116, రూ.3,116, రూ.2,116 అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9381797620, 9010324747, 9666377546 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

లారీ ఢీకొనడంతో కూలీ మృతి

పొట్టకూటికి వెళుతూ అనంత లోకాలకు..

విగతజీవిగా ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరైన భార్య

చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద మిన్నంటిన రోదనలు

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే... స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కుంచాల సురేష్(35), శ్రావణి దంపతులు. వీరికి ముగ్గురు కుమారులున్నారు. సురేష్ రోజువారీ కూలీతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తన్నీరు సురేష్‌తో కలిసి కుంచాల సురేష్ ద్విచక్రవాహనంపై కఠారిపాలెంలో బేల్దారీ పని కోసం బయలుదేరారు. ఈక్రమంలో మన్నం అపార్ట్‌మెంట్ వద్దకు రాగానే జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఉండటంతో బైక్‌ను నిదానం చేశారు. అదే సమయంలో చీరాల పట్టణంలో ఫ్యాన్సీ స్టోర్ లోడు దించి విజయవాడకు వెళుతున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కుంచాల సురేష్ మాత్రమే తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స కోసం గుంటూరుకు సిఫార్సు చేశారు. బంధువులు అంబులెన్స్‌లో ఎక్కిస్తుండగానే తుదిశ్వాస విడిచాడు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించారు.

సాయంత్రం ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తానని చెప్పి...

పనికి వెళ్లి పెందల కడనే వస్తా.. ఎగ్జిబిషన్‌కు వెళదామని కుంచాల సురేష్ ఉదయాన్నే చెప్పి పనికి వెళ్లాడు. అలా వెళ్లిన గంట తరువాత చీరాల ఏరియా వైద్యశాలలో శవమై కనిపించాడు. లోకం తెలియని ముగ్గురు పసి కందులు తల్లి శ్రావణిని హత్తుకుని బోరున విలపించారు. 'ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తానంటివే లే నాన్న' అని పిల్లలు రోదించడం అందర్నీకలచివేసింది. వారిలో ఒక బాబు హాస్పిటల్ గ్రిల్స్ పట్టుకుని రోదిస్తుంటే వదిలించడం పెద్దల తరం కాలేదు.

ముక్తేశ్వరంలో ఈదురు గాలులు

పడిపోయిన రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు

రూ.4 లక్షల మేర ఆస్తి నష్టపోయినట్లు బాధితుల ఆవేదన

బల్లికురవ, మే 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గురువారం రాత్రి ఈదురు గాలి భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రెండు గంటల మేర వీచిన గాలుల ప్రభావానికి రెండు రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అందిన సమాచారం మేరకు... ముక్తేశ్వరం రైస్ మిల్లు సమీపంలో ఉన్న తోట అంకమ్మరావు సుమారు రూ.4 లక్షలు వెచ్చించి ఇటీవల పశువులకు రేకుల షెడ్డు వేశారు. ఈదురు గాలి ప్రభావానికి షెడ్డు మొత్తం నేలమట్టమైంది. ఇదే గ్రామంలో సూరేపల్లిరోడ్డులో ఉన్న రావువారి పోతురాజు వేసుకొన్ని రేకుల షెడ్డు కూలిపోయింది. ప్రమాద సమయంలో షెడ్డులో ఎవరూ లేరు. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.





గాలులకు ధ్వంసమైన రేకుల షెడ్డు, కూలిన కరెంటు స్తంభం

రాజీవ్‌నగర్‌లో రోడ్లు నిర్మించాలి

ఒంగోలు కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో రోడ్లు, డ్రైన్‌లు నిర్మించి, రెండువైపులా ఫుట్‌పాత్, డిజిటల్ లైట్లు వేయాలని ఒంగోలు సిటిజన్ అధ్యక్షుడు కొల్లా మధు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కాలంలో రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో అపార్ట్‌మెంట్‌లు, భవనాలు నిర్మాణం జరుగుతుండటంతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, అయితే రోడ్లు, సీసీడ్రైన్‌లు లేకపోవడంతో వర్షాలు వచ్చినపుడు ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ ఇస్మాయిల్ కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వంతో పాటు పాటలు, కథలు వాటిలో నైపుణ్యం ఉండాలని చెప్పారు. బాలోత్సవం కార్యదర్శి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు చేపించారు. కూల్‌డ్రింక్ తాగడం వల్ల జరిగే నష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో మ్యాజిక్ రామన్, ఇంద్రజ్యోతి, వీరస్వామి, వినోద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న దాతలు

ఒంగోలు(కల్చరల్), మే 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం దశరాజుపల్లె రోడ్డులోని ఆశయం శరణాలయంలో శుక్రవారం సాయంత్రం నిరుపేదలకు అన్నదానం జరిగింది. నిర్వాహకురాలు లీలారాణి తన మాతృమూర్తి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. అదేవిధంగా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు గురవారెడ్డి ఆర్థిక సహకారంతో నిరుపేదలకు దోమతెరలు, దోమతెర కర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి ప్రారంభించిన సేవా కార్యక్రమాలను లీలారాణి కొనసాగిస్తూ ఒంగోలులో అటు అద్దంకిలో అనేకమంది అనాధలకు విశేషమైన సేవలు అందించటం అభినందనీయమని అన్నారు. పలువురికి ఆయన భోజనం ప్యాకెట్లు అందజేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

మద్దిపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): మహిళలను సంఘటితం చేస్తూ వారి ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంగా మహిళా సమైక్య పనిచేస్తుందని ఏపీఎం కాకుమాను సుబ్బారావు తెలిపారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో జరిగిన సమావేశంలో ఆయన పశు ఆధారిత, వ్యవసాయేతర జీవనోపాధులు, బ్యాంకు లింకేజీ కార్యక్రమాలు అంశాలపై సమీక్షించారు. నిరుపేద మహిళల జీవనోపాధి కోసం రుణాలు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీసీలు, సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాంతక జ్వరాల నివారణపై అవగాహన

మద్దిపాడు, మే9(ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూ, గున్యా వంటి ప్రాణాంతకమైన జ్వరాల నివారణపై ప్రజల అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ఆనంద్‌మోహన్ కోరారు. శుక్రవారం మద్దిపాడు పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వైద్యసిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, గున్యా లాంటి ప్రాణాంతక జ్వరాలపై అవాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, డాక్టర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరుడికి హంస వాహన సేవ

మద్దిపాడు మే9(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి హంస వాహన సేవ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య కుటుంబాలు నిర్వహించారు. స్వామివారు హంసవాహనంపై విహరించారు. ప్రధానార్చకులు నారాయణం వెంకటాచార్యులు, రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేఉశారు. ఆలయ ఈవో నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

భూసార పరీక్షలను చేయించుకోవాలి

మద్దిపాడు, మే9(ఆంధ్రజ్యోతి): భూమి సారవంతంగా ఉంటేనే అధిక పంటల ఉత్పత్తి సాధ్యమని, అందువల్ల భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో కె.రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం భూసార పరీక్షలు నమూనాను సేకరించే విధానంపై శిక్షణ కార్యక్రమం మద్దిపాడు వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రైతులు తమ పొలంలోని పోషక విలువలు తెలుసుకోవడం ద్వారా తగిన ఎరువులు వాడి తక్కువ ఖర్చుతో పంట దిగుబడి పొందవచ్చన్నారు. రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు ద్వారా పొలంలో మట్టి నమూనాలు సేకరించటానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మద్దిపాడు, మే 9(ఆంధ్రజ్యోతి):మల్లవరంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వాసవీ అన్నదాన సత్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది మహిళలచే సామూహిక కుంకుమార్చన జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మువ్వల శ్రీనివాసు, ఆకుతోట శ్రీనివాస రావు, చిన్ని అమరనాథ్, గుగ్గిలం సోమశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి



సింహవాహనంపై స్వామివారు

నాగులుప్పలపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వార్షిక ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం సింహవాహనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి దేవాలయంలో సుప్రభాత సేవ, ప్రసాద వినియోగం చేశారు. రాత్రి పెదగంజాం సూర్యనారాయణ భక్తబృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సింహవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి వారి గ్రామంలో విహరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రేపటి నుంచి ఒంగోలులో పెయింటింగ్ సమ్మర్ క్యాంప్

ఒంగోలు(కల్చరల్), మే 9(ఆంధ్రజ్యోతి): సృష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో పెయింటింగ్ సమ్మర్ క్యాంప్ స్పెషల్ బ్యాచ్ ప్రారంభమవుతున్నట్లు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ తిమ్మిరి రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు జూనియర్స్, సీనియర్స్, ప్రొఫెషనల్ విభాగాలుగా వయసుతో నిమిత్తం లేకుండా ఒంగోలులోని శ్రీనివాస థియేటర్‌రోడ్‌లో గల సెయింట్‌థెరిస్సా హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి 10.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనుభవం ఉన్న చిత్రకారులతో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వివరాలకు 8197090007 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు వెన్నులో వణుకు

అద్దంకిటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు వెన్నులో వణుకు మొదలైందని రిటైర్డ్ సైనికులు చాగంటి శేషారెడ్డి చెప్పారు. శుక్రవారం అద్దంకిలో నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం కార్యక్రమం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ దేశంలో ఉన్న 140 కోట్ల మంది ఒక్కసారిగా కన్నెర్రజేస్తే పాకిస్తాన్ మాడిమసై పోతుందని, ఉగ్రవాదానికి ఇవే చివరి రోజులని చెప్పారు. యుద్ధంలో అమరులైన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాగినేని రామకృష్ణ, చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ ఖాసీంసాహెబ్, మహబూబ్, దివాకర్ దత్తు, రఘుచంద్, రామాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన జిల్లా అధికారులు

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కిందచేపట్టిన పనుల్లో పురోగతి సాధించడంతో పాటు లేబర్ మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై మండలాల వారీ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెలలో 1680 ఫారంపాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. ఈనెల 15వ తేదీన తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల చేస్తున్నందున జిల్లాలోని అన్ని నీటి వనరులను నింపుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో జిల్లాపరిషత్ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీపీవో పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలి

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. స్థానిక గ్రీవెన్స్ హాలులో శుక్రవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేలా పంచాయతీరాజ్ శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకొని ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం గృహ నిర్మాణ శాఖపై జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 12న సామూహికంగా గృహ ప్రవేశ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున తదనుగుణంగా జిల్లాలో లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవోలు తేలికగా తీసుకుంటే ఊరుకోనేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జడ్పీ సీఈవో చిరంజీవి, మండలాల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ ఇవ్వాలి

ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని కలెక్టర్ అన్సారియా హెచ్చరించారు. గ్రీవెన్స్ హాలులో శుక్రవారం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయాల ద్వారా అందే సేవలు మన మిత్ర యాప్‌లో కూడా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దుర్బలమైన (వల్నరబుల్) చిన్నారుల గుర్తింపు సర్వేను పక్కాగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక గ్రీవెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాచర్ల మండలంలో ఇప్పటికే ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.


మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

ఒంగోలు క్రైం, మే9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలను విస్తృతం చేశారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రద్దీ ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. అనుమానితులను విచారిస్తున్నారు. అంతర్గత భద్రత దృష్ట్యా ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. అనేక ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా అనుమానాస్పద బ్యాగ్‌లు, ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్-112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

పద్మ అవార్డ్సకోసం 31లోపు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీన ఇచ్చే పద్మ అవార్డు కోసం ఈనెలాఖరులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో కోరారు. జాతీయస్థాయిలో వివిధ అంశాల్లో ఆర్ట్ (కళారంగం), విద్య, సాహితీరంగం, క్రీడారంగం, వైద్యం, సామాజిక సేవ, సైన్స్‌అండ్ ఇంజనీరింగ్, ప్రజాసంబంధాలు, పౌర సేవలు, తయారీ, సేవ తదితర రంగాల్లో ఉత్తమసేవ/ప్రతిభ చూపే కార్యక్రమాలు చేపట్టిన వారికి పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ తదితర అవార్డులను ప్రదానం చేస్తారు. వారు చేసిన సేవలకు గుర్తింపుగా పద్మ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలను 91828 91095 నెంబరు ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

టెన్త్ షార్ట్ మెమోలు సిద్ధం

ఒంగోలు విద్య, మే 9 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల షార్ట్ మెమోలు ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉన్నట్లు డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్ నుంచి షార్ట్‌మెమోలను డౌన్‌లోడ్‌చేసి విద్యార్థులకు అందజేయాలని ఆయన ఆదేశించారు. మార్కుల మెమోల్లో ఏమైనా తప్పులుంటే పాఠశాల రికార్డులు పరిశీలించి తప్పులు ధ్రువీకరణ అయితే పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్ నకలు విద్యార్థి మార్కుల మెమోకు జతపరిచి తప్పుల సవరణకు ఈనెల 25లోపు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలని ఆయన కోరారు.

12న ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఒంగోలు, కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో క్రికెట్ అండర్ 23, సీనియర్స్ పురుషుల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు జూన్‌లో మంగళగిరి, మూలపాడు మైదానాల్లో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యేవారు వైట్‌డ్రస్, షూస్, సొంత కిట్‌లతోపాటు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు కోచ్‌లు సుధాకర్ 97010 22333, బి.చంద్ర 92462 22999 నంబర్లను సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న పీడీ నారాయణ

డ్వాక్రా మహిళలకు 1100 ఉపాధి యూనిట్లు

● డీఆర్‌డీఏ పీడీ నారాయణ ● సెర్ప్ సిల్వర్‌జూబ్లీ సందర్భంగా ఏర్పాటు చేయాలని ఆదేశం

ఒంగోలు నగరం, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పడి ఇప్పటికి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పొదుపు సంఘాల మహిళలకు విరివిగా రుణాలు అందజేసి వారి ద్వారా స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేయాల్సి ఉందని డీఆర్‌డీఏ, వెలుగు పీడీ టి.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని టీటీడీసీ సమావేశం హాలులో జిల్లాలోని డీపీఎంలు, ఏపీఎంలు, ఏసీలు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ సందర్భంగా వచ్చే నెలలో పొదుపు సంఘాల మహిళలతో జిల్లాలో 1100 యూనిట్లను ప్రారంభించాలని చెప్పారు. గత నెలలో నిర్వహించిన సర్వే ఆధారంగా వార్షిక రుణప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సర్వేలో ఫామ్ సెక్టార్ కింద రూ.1226 కోట్లు, నాన్ ఫామ్ సెక్టార్ కింద రూ.407 కోట్లు, ఇతర రుణాల కోసం రూ.2023కోట్లు, సొంత అవసరాల కోసం రూ.2926 కోట్లు మహిళలు రుణాలు కోరారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మొదటి క్వార్టర్ కింద జూన్‌లోపు అందించాల్సిన రుణాలపై మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేయాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి, కమ్యూనిటీ ఇన్వెస్టుమెంట్ రుణాలను ఇచ్చేందుకు ప్రతి సభ్యురాలి నుంచి వివరాలు సేకరించి ఏపీఎం లాగిన్ నుంచి బ్యాంకులకు పంపించాలని ఆయన కోరారు. సీసీలు ప్రతి సంఘం సమావేశం ఏర్పాటు చేసి వారికి అవసరమైన రుణాల వివరాలను తెలుసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న మైక్రో ఫైనాన్స్ కార్యక్రమాల వివరాలను కూడా తెలుసుకుని నివేదిక అందజేయాలని కోరారు. పొదుపు సంఘాల మహిళల ద్వారా షేడ్ నెట్స్, ఫిష్ యూనిట్స్, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ ద్వారా యూనిట్లను ఏర్పాటు చేసేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.

పవన్‌కల్యాణ్ త్యాగం మరువలేనిది

● కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ● ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

పీసీపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల దాడిలో మృతిచెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ నూగతోటి పవన్‌కల్యాణ్ ప్రాణత్యాగం మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కొనియాడారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మావోయిస్టుల దాడిలో మృతిచెందిన పీసీపల్లి మండలం ముద్దపాడు గ్రామానికి చెందిన పవన్‌కల్యాణ్ మృతిచెందాడు. భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం తెలంగాణ పోలీసులు ముద్దపాడుకు తీసుకువచ్చారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పవన్‌కల్యాణ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ దేశం కోసం మావోయిస్టులతో పోరాడి వీరమరణం పొందారన్నారు. పవన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని పవన్ తల్లిదండ్రులు బాలచెన్నయ్య, ఆదిలక్ష్మమ్మ, సోదరిలు మహాలక్ష్మి, రేఖలకు భరోసా ఇచ్చారు. అనంతరం అధికారులు, ప్రజలతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

● **పోలీసు అధికారుల నివాళి**

పవన్‌కల్యాణ్ భౌతికకాయానికి కనిగిరి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు నివాళులర్పించారు. డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో సబ్‌డివిజన్‌లోని నలుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు, సిబ్బంది ముద్దపాడుకు వచ్చి పవన్‌కు అంజలి ఘటించారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, తెలంగాణ నుంచి వచ్చిన పోలీసులతో పాటు స్థానిక పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు. గౌరవసూచికంగా పోలీసులు మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి అంతిమ వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో తెలంగాణ రాష్ట్ర గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండెంట్ జి.వెంకటేశ్వర్లు, గ్రేహౌండ్స్ డీఎస్పీ జ్ఞానేశ్వర్, కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, సీఐలు షేక్ ఖాజావలి, భీమానాయక్, సోమశేఖర్, ఎస్ఐలు జి.కోటయ్య, మాధవరావు, శ్రీరామ్, సుమన్, కిషోర్, క్రిష్ణపావని, రమేష్, ప్రేమ్‌కుమార్, అనూక్ పాల్గొన్నారు.


నాగార్జున సాగర్ కాలువపై రెండో బ్రిడ్జి నిర్మాణం కోసం పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

రెండో బ్రిడ్జి కోసం నిధులిస్తాం

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి

ఎర్రగొండపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) త్రిపురాంతకం నుంచి ఎర్రగొండపాలెం వచ్చే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కాలువపై రెండో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మాత్యులు బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో కలిసి శుక్రవారం కాలువపై పరిశీలించారు. త్రిపురాంతకం దేవస్థానం సమీపంలో ఉండడంతో భక్తులు నిత్యం సాగర్ కాల్వ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నారని, శివరాత్రి పండుగ రోజు పాత బ్రిడ్జిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని మంత్రికి ఎరిక్షన్‌బాబు వివరించారు. పాత బ్రిడ్జి ఇరుకుగా ఉన్నందున ఎదురుగా వాహనం వస్తే పక్కకు తొలగే అవకాశం లేదని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్లతో మాట్లాడి నిధులు మంజూరు చేస్తానని అక్కడకు చేరుకున్న టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

టిప్పర్ ఢీకొని ఎక్సైజ్ కానిస్టేబుల్ దుర్మరణం


వెంకటరామిరెడ్డి (ఫైల్)

ఒంగోలు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ వెనుక నుంచి స్కూటీని ఢీకొనడంతో దానిపై ప్రయాణిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ పోతిరెడ్డి వెంకటరామిరెడ్డి (51) దుర్మరణం చెందాడు. ఈ ఘటన సంతనూతలపాడులోని మైనంపాడు డొంక వద్ద శుక్రవారం జరిగింది. చీమకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి విధులు ముగించుకొని ఒంగోలులోని తన ఇంటికి స్కూటీపై బయలుదేరారు. అయితే చీమకుర్తి వైపు నుంచి వస్తున్న టిప్పర్ వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టింది. దీంతో వెంకటరామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన కాలు శరీరం నుంచి విడిపోయి ఛిద్రమైంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అజయ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని వెంకటరామిరెడ్డిని 108 వాహనం ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్రగాయాలతో మార్గమధ్యలోనే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ నగరంలోని పేర్నమిట్ట సమీపంలో నివాసం ఉంటున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న చీమకుర్తి ఎక్సైజ్ సీఐ ఎం.సుకన్య, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పీఆర్ ఎస్ఈగా నిశ్శాంత్ హుసేన్

కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా నిశ్శాంత్ హుసేన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలవుపై వెళ్లిన నిశ్శాంత్‌హుసేన్ గతనెల 6న విధుల్లో చేరటంతో ఆయనను ఇక్కడ ఎస్ఈ నియమించారు.

మరో ఎద్దుపై పెద్దపులి పంజా

● చంపి అడవిలోకి లాక్కెళ్లిన వైనం ● రెండు నెలల్లో 5 మృత్యువాత

అర్థవీడు (కంభం), మే 9 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులి పంజా విసురుతోంది. ముఖ్యంగా అర్థవీడు ప్రాంత గ్రామాల్లో రాత్రిళ్లు పెద్దపులి సంచారం చేస్తూ కనపడిన పశువులు, ఎద్దులను చంపేస్తోంది. తాజాగా బుధవారం రాత్రి గుడిసెలో కట్టివేసిన ఎద్దును చంపి అడవిలోకి తీసుకెళ్లింది. దీంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గడచిన రెండు నెలల కాలంలో అటవీ సమీప గ్రామాల్లో రెండు ఎద్దులు, మూడు గేదెలను చంపేసింది.

అర్థవీడు మండలం బొల్లుపల్లి గ్రామసమీప అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి పెద్దపులి ఎద్దుపై దాడి చేసి చంపివేసింది. ఈ ఘటన శుక్రవారం వెలుగుచూసింది. బొల్లుపల్లి, అచ్చంపేట, పాపినేనిపల్లి ఫారెస్టు ఆఫీసర్ మంగెనాయక్ కథనం ప్రకారం బొల్లుపల్లి గ్రామానికి చెందిన గద్దల నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం వరకు తన నాలుగెకరాల పొలాన్ని ఎడ్లతో దున్నాడు. పొద్దుగూకడంతో అడవికి 200 మీటర్ల దూరంలో ఉన్న గుడిసెలో ఎడ్లను కట్టివేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం గుడిసె వద్దకు వెళ్లగా ఒక ఎద్దు కనిపించలేదు. రైతు చుట్టుపక్కల గాలించగా పొదలచాటున ఎద్దు మృతిచెంది కనిపించింది. ఆ వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి వెళ్లి ఎద్దు కళేబరాన్ని పరిశీలించారు. పెద్దపులి పాదముద్రలను సేకరించారు. ఆ సమీప ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక ఎద్దును పెద్ద పులి చంపడంతో వ్యవసాయం ఎలా చేయాలి అని రైతు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశాడు.

2 నెలల్లో 5 పశువులను చంపిన పెద్దపులి


పెద్దపులి అడుగు ముద్ర

రెండు నెలల కాలంలో పెద్దపులి అర్థవీడు మండలంలో 5 పశువులను చంపింది. అర్థవీడు మండలంలోని పాపినేనిపల్లి, బొల్లుపల్లి, కొత్తూరు, వీరభద్రాపురం, వెలగలపాయలోయల్లో 3 గేదెలను, 2 ఎద్దులను పెద్దపులి దాడి చేసి చంపింది. వీటన్నింటిని ఒకే పెద్దపులి చంపిందని భావిస్తున్నారు. దీనిపై ఫారెస్టు అధికారి మంగెనాయక్‌ను వివరణ కోరగా పెద్దపులి ఆహార అన్వేషణ కోసం రోజుకు 50 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తుందని, అయితే వీటన్నింటిని ఒకే పెద్దపులి దాడి చేసి చంపిందని చెప్పలేమని అన్నారు. పాదముద్రలు సేకరించి వాటిని పర్యవేక్షించిన తరువాత ఒక పులి వచ్చిందా లేదా రెండు పులులా అనేది చెప్పగలమన్నారు. పశువులు మేతకు వెళ్లి తిరిగి వచ్చిన సమయంలో పెద్దపులి దాడి చేసి చంపుతుందన్నారు. 6 నెలలుగా ఈప్రాంతంలో సంచరిస్తున్న పులి విషయంలో గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని,చీకటి పడగానే ఇళ్లకు చేరుకోవాలని ఆయన సూచించారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

● ఉద్యోగ జేఏసీ చైర్మన్ శరత్‌బాబు


ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఉద్యోగ జేఏసీ చైర్మన్ కె.శరత్‌బాబు ఆరోపించారు. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనను వ్యతిరేకిస్తూ ఏపీటీఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్‌జీవో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ విధానాన్ని తప్పుపట్టారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూళ్లు ఈ మూడు రకాల విధానమే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ పత్రికా సంపాదకులు ఎస్.గురునాథశర్మ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలన్నింటికీ ఒకే స్టాఫింగ్ ప్యాటర్న్ ప్రకారం టీచర్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ.విజయసారథి, బి.రఘురాం, కె.సుబ్బారావు, తిరుమల, కె.సుబ్బారాయుడు, నాయబ్‌రసూల్, హనుమంతరావు, శేషారావు, శివరామకృష్ణ, లేవి ప్రసాద్, కె.రవి, యోహాన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లాశాఖకు ఎంవీ.కృష్ణ, గురుప్రసాద్‌లు రూ.12వేల విలువైన మైక్ సిస్టమ్‌ను అందజేశారు.


మంత్రి ఆనంకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయఅధికారి

మహాకుంభాభిషేకానికి మంత్రి ఆనంకు ఆహ్వానం

అద్దంకి, మే 9(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 19వ తేదీ జరగనున్న మహాకుంభాభిషేకం కార్యక్రమానికి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం శింగరకొండ ఈవో తిమ్మానాయుడు ఆహ్వానించారు. వేదపండితులు, పూజారులతో కలిసి వెళ్లి రామనారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. రాతి మండపం నిర్మాణానికి విరాళాల అందజేత శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. బల్లికురవ మండలం వైదనకు చెందిన యక్కల సుబ్బారాయుడు, ధనమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చలపతిరావు, వెంకాయమ్మలు లక్ష రూపాయలు, పంగులూరు మండలం జాగర్లమూడివారిపాలెనికి చెందిన జరుగుల ఆంజనేయులు 1,01,116 రూపాయలు ఈవోకి అందజేశారు.

అవీ..ఇవీ



నరసింహాపురం గ్రామంలో స్థానికులను విచారిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

ప్రభుత్వ స్థలాల పరిశీలన

మార్కాపురం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నరసింహపురం గ్రామ ఇలాకాలో అల్లూరి పోలేరమ్మ గుడి వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాలను తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. గతంలో ప్రభుత్వం ఇంటి స్థలాలను కొందరికి మంజూరు చేసినా ఆ స్థలాలలో నిర్మాణాలు చేయకపోవడంతో ఖాళీగా ఉన్నాయని గుర్తించారు. ఆ స్థలాలు ప్రభుత్వం నుంచి తీసుకున్న కొందరు మరికొందరికి అనధిదికారికంగా విక్రయించినట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న రీసర్వే 2 ప్రోగ్రాంలో భాగంగా ఆ ప్రభుత్వ స్థలాలపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.



పుల్లలచెరువు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పత్రాలు అందజేస్తున్న మండల అధికారులు

అంగన్వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధ ఉత్సవం

పుల్లలచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రంలో ప్రాథమికం పూర్తి చేసుకున్న చిన్నారులకు పాఠశాల సంసిద్ధ ఉత్సవం నిర్వహించారు.శుక్రవారం పుల్లలచెరువు అంగన్వాడీ సెక్టారు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ అంగన్వాడీలో పూర్తి అయిన చిన్నారులు జూన్ 12న పాఠశాలల్లో చేరాలని అన్నారు.ప్రథమ తరగతిలో చేరే ముందు చిన్నారుల అక్షరభాస్యంపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం చిన్నారులకు ప్రథమ తరగతిలో చేరేందుకు పత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజరు శివపార్వతి, కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారావు, టౌన్ ఎస్ఐ సైదుబాబు, పోలీసులు

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

మార్కాపురం రూరల్, మే9 (ఆంధ్రజ్యోతి) : యుద్ధం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని జాతీయ రహదారిపై కార్లు, వాహనాల తనిఖీలను సీఐ సుబ్బారావు, టౌన్ ఎస్ఐ సైదుబాబులు సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాత్రి సమయాలలో లాడ్జిలలో సోదాలు నిర్వహించి అనుమానితులను గుర్తించి గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను చూపించాలని కోరారు. మీ ప్రాంతాలలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లుగా గుర్తిస్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని అవగాహన కల్పించారు.



హనుమంత వాహనంపై సత్యదేవుడు

సత్యదేవునికి హనుమంత సేవ

మార్కాపురం వన్‌టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని 9వ వార్డులో ఉన్న శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల గౌరిశంకర శర్మ సత్యనారాయణస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సత్యదేవునికి హనుమంత వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాసాని సుధాకర్, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసులు, డి.కోటేశ్వరరావు, కార్యదర్శి పొత్తంశెట్టి చిన్నసుబ్బారావు, సహాయ కార్యదర్శులు నూనె రామిరెడ్డి, బాసాని ఉమా, కోశాధికారి కేవీ సుధాకర్‌రావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కష్టపడి పనిచేసే వారికే పదవులు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి అహర్నిశలు కష్టపడి పనిచేసేవారికే మండలంలోని గ్రామపంచాయతీలలో అధ్యక్షకార్యదర్శులను ఎంపిక చేయాలని టీడీపీ నాయకులను టీడీపీ ఇన్ చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో శుక్రవారం జరిగిన టీడీపీ మండల సంస్థాగత ఎన్నికల సందర్భం టీడీపీ ఇన్‌చార్జి మాట్లాడారు.ఈ నెల 18 వతేదీ లోపు సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీశ్రేణులను ఆదేశించారని తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాలలో పార్టీకి విస్తృత సేవలు అందించిన యువకులకు పార్టీ పదవులకు ఎంపిక చేస్తామని అన్నారు. కొందరిని రాష్ట్ర కమిటీలలో పదవులు ఇప్పిస్తానని అన్నారు. ఈ సభలో టీడీపీ మండల అధ్యక్షుడు మేకల వళరాజు, నీటి సంఘం అధ్యక్షుడు దేవినేని చలమయ్య, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల నాయకులు అనుమాల శెట్టి సుబ్బారావు, అల్లూరరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామ కమిటీలకు అధ్యక్ష కార్యదర్శులను మండల టీంలను ఎంపిక చేశారు.



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

కిశోర వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

ఎర్రగొండపాలెం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిశోర వికాసం వేసవి శిబిరాలు బాలికలకు ఎంతో ఉపయోగపడతాయని ఎర్రగొండపాలెం ఐసీడీఎస్ సీడీపీవో ఎం. పద్మావతి అన్నారు. బాలికల హక్కులు, లైగింక వేధింపులు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, క్రీడలు, ఉన్నత విద్యలో ఉన్నత శిఖరాలు తదితర వాటిపై అవగాహన కల్పించడంతో పాటు బాలికలు సమాజంలో మెలగాల్సిన అంశాలు ఈ శిబిరం ద్వారా ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి మంగళ, శుక్రవారాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ పరిధిలో మొత్తం 248 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఎర్రగొండపాలెం మండలంలో 90 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా 3,360 మంది బాలికలు ఉన్నారు. పుల్లలచెరువు మండలంలో 81 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా సుమారు 3వేల మంది,త్రిపురాంతకం మండలంలో 77 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా సుమారు 2,800 మంది బాలికలు ఉన్నారు. వీరందరికీ ప్రతి మంగళ, శుక్రవారాలలో ప్రభుత్వం నిర్ణయించిన సబ్జెక్టలపై అవగాహన కల్పిస్తారు.

మార్కాపురంలో అవగాహన

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని 48వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు మ్యూజికల్ చైర్స్, వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు రమాదేవి, కృష్ణవేణి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై చర్యలకు మద్దతుగా ప్రత్యేక పూజలు

గిద్దలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులపై నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు పట్టణంలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై దాడి చేస్తున్న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ బలగాలకు ఎటువంటి ఆపద కలుగకుండా ఉండాలని పూజలు చేశారు. అనంతరం జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, ఎంఈవో నాగభూషన్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఇతర సంఘాల నాయకులు శివమల్లారెడ్డి, భూపాల్‌రెడ్డి, సురభయ్య, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాలతో ప్రజలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

సైనికులకు సంఘీభావ ర్యాలీ

గిద్దలూరు : దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న సైనికులకు సంఘీభావంగా ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జీవనజ్యోతి కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ నిరంజన్ ర్యాలీలో పాల్గొనగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు ర్యాలీకి మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

పెద్ద దోర్నాల,మే 9(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయం ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ గోపుర కలశ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 10,11వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.10వ తేదీ ఉదయం గోపూజ, మంగళవాయిద్యాలు,పుణ్యాహవాచనం, దీక్షాధారణ, కలశ ఆవాహనం, అఖండ స్థాపన, కంకణధారణ, మన్య సూక్త పారాయణ, హోమాలు, తీర్థ ప్రసాద వినియోగం, 11వ తేదీన తెల్లవారు జామున 4గంటల నుంచి ఆది వనపూజ, శిఖర యంత్రం, గర్తన్యాసం, యంత్రస్థాపన, ఆంజనేయస్వామికి విశేష ఆకుపూజలు, మహా పూర్ణాహంతి, మహా కుంభాభిషేకం జరుగుతాయని కమిటీ తెలిపింది.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

మార్కాపురం వన్‌టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తామని ఆ సంస్థ ప్రతినిధి షేక్ ఫిరోజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఉచిత శిక్షణ కుట్టు మిషన్ శిక్షణ 3 నెలలు నేర్పించి ధ్రువీకరణ పత్రం ఇస్తారని ఓసీ, బీసీ, ముస్లిం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు అర్హులని, 15 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపువారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రికల్‌లో శిక్షణ ఇస్తామని, పదో తరగతి పాసై ఉండాలని, 3 నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు. అసిస్టెంట్ ప్లంబర్ జనరల్, దీనికి కూడా పదో తరగతి పాసై ఉండాలని, 3నెలల శిక్షణా కాలం అని తెలిపారు. మగవారు అర్హులన్నారు. శిక్షణ కోసం 7013950097 నెంబర్‌కు సంప్రదించాలని, తర్లుపాడు రోడ్డులోని పట్టు పరిశ్రమల కేంద్రంలో ఈ శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు.

భర్తను చంపిన భార్య అరెస్టు

కంభం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3వ తేదీన భర్త వలీని చంపిన భార్య రిజ్వానాను శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగరాజు తెలిపారు. శుక్రవారం కంభం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంభం పట్టణం కాప వీధికి చెందిన షేక్ వలి నిత్యం మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఆక్రమంలోనే 3వ తేదీ రాత్రి భార్యతో గొడవపడ్డాడు. ఆసమయంలో భార్య రిజ్వానా టవల్‌తో భర్తకు మెడకు గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. ఈఘటనపై మృతుడు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేయగా సీఐ మల్లికార్జున దర్యాప్తు చేపట్టారు. రిజ్వానా హత్య చేసినట్లు రుజువుకావడంతో గురువారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.



కంభం సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

ఘనంగా సత్యసాయి జయంతి ఉత్సవాలు

పెద్ద దోర్నాల, మే9 (ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సభ్యులు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సంజీవ్, రామాంజనేయులు,లావణ్య, సంస్థ సభ్యులు మహాలక్ష్మమ్మ,పద్మ పాల్గొన్నారు.



రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న సేవాసంస్థ సభ్యులు

ప్రత్యేక పూజలు

గిద్దలూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మడియాలేశ్వర స్వామి ఆలయంలో రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశభద్రత కోస పాకిస్తాన్‌తో పోరాటం చేస్తున్న సైనికులకు మద్దతుగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గిద్దలూరు పర్యటనకు వచ్చిన ఆమె తెలిపారు.

21న లక్ష్మీ నరసింహస్వామి జయంతి మహోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివార్లలో ఉన్న కపిలగిరి లక్ష్మీ నరసింహస్వామి జయంతి మహోత్సవం ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మృతి

గిద్దలూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువమెట్ట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భూపని వెంకటరామనాయుడు ఆకస్మికంగా మృతిచెందారు. రాచర్ల మండలం పాలకవీడుకు చెందిన రామానాయుడు తండ్రి కూడా అటవీశాఖలోనే పని చేశారు.

నేడు విద్యుత్‌సరఫరా నిలుపుదల

కొమరోలు, మే9(ఆంధ్రజ్యోతి): కొమరోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తర్లుపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన వారు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.కిశోర్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల కోసం 6 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వాటిలో నూతన రేషన్ కార్డు జారీ, కార్డుల విభజన, చిరునామాల మార్పు, సభ్యులను చేర్చటం, ఉన్న సభ్యులను తొలగించటం, వేరే గ్రామాలకు కార్డులను మార్చటం వంటి సేవలను దగ్గర్లో ఉన్న సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారం, పది రోజుల తర్వాత ప్రభుత్వం ద్వారా కూడా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సేవలను అర్హులైన వారు వినియోగించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కిశోర్ కుమార్



సమస్యలను వివరిస్తున్న కేఎంసీ కో-ఆర్డినేటర్ శ్రావ్య

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

పెద్ద దోర్నాల,మే 9(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతం లోని పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాస నాయక్ సూచించారు.స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని డీసీహెచ్ఎస్ శ్రీనివాసనాయక్, కేఎంసీ కో-ఆర్డినేటర్ శ్రావ్య శుక్రవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వైద్యశాలకు హాజరయిన జిల్లా అధికారులకు స్థానిక వైద్యాధికారులు ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను వివరించారు. రోజుకు 180 నుంచి 250 వరకు ఓపీ ఉంటుందని, ముఖ్యంగా నల్లమల ఘాట్ రోడ్లలో ప్రమాదాలు జరుగుతుంటాయని తెలిపారు. అందుకు గానూ ఎక్స్‌రే ప్లాంటు,ల్యాబ్ టెక్నీషియన్, నీటి కొరత ఉందని, అదేవిధంగా వైద్యశాల కొంత భాగం ప్రహరీ గోడ లేకపోవడంతో కుక్కలు, పందులు సంచరిస్తున్నాయనితదితర సమస్యలను వివరించారు. స్పందించిన శ్రీనివాసనాయక్, శ్రావ్య మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సంజీవ్, రామాంజనేయులు,లావణ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న పొదిలిలో విద్యుత్ అదాలత్

పొదిలి, మే 9(ఆంధ్రజ్యోతి) : పొదిలిలో ఈ నెల 13వతేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ పి. శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. కన్జూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫారం విజయవాడ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్ విక్టర్ ఇమ్మానియేల్, ఫారం సభ్యులు, ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె. వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. దర్శి డివిజన్‌లోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్ళూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. సర్వీస్ కనెక్షన్, పూర్తి అడ్రస్సు, సెల్ నెంబర్‌తో అర్జీ ఇవ్వాలన్నారు. అందులో విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏసమస్యనైనా ఈ సమావేశంలో తెలియజేయాలన్నారు. సమావేశంలో నమోదు చేసుకొన్న సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

గోవా మద్యం సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్

కంభం, మే 9 (ఆంధ్రజ్యోతి): గోవా మద్యం సరఫరా చేసే మహారాష్ట్రలోని ముంబయిలో నివశించే దేవేంద్రన్ వీరప్పన్‌శెట్టి అనే నిందితుడిని అరెస్టు చేసి కంభంకు తీసుకువచ్చినట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం ముంబాయికి చెందిన దేవేంద్రన్ వీరప్పన్‌శెట్టి గోవా మద్యం తెచ్చి కంభం, బేస్తవారపేట మండలాల్లో విక్రయించే వాడని తెలిపారు. తమకు పట్టుబడకుండా ముంబయికి వెళ్ళినట్లు తెలుసుకున్న తాము అక్కడకు వెళ్లి చార్‌కోట్ పోలీసు సహకారంతో వీరప్పన్‌శెట్టిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని బోదివలిలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచి అక్కడ నుంచి శుక్రవారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈఆపరేషన్‌లో గిద్దలూరు ఎక్సైజ్ సీఐ జయరావ్, సిబ్బంది షేక్ షంషీర్, షేక్ రహంతుల్లా, శ్రీనివాసులు పాల్గొన్నట్లు తెలిపారు.



నిందితుడితో కంభం ఎక్సైజ్ పోలీసులు

విద్యుత్ తీగలు తెగిపడి 3 గేదెలు మృతి

మార్కాపురం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలభీమునిపాడు గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కోలభీమునిపాడు గ్రామానికి చెందిన మందా సత్యనారాయణరెడ్డికి చెందిన గేదెలు శుక్రవారం ఉదయం పొలానికి మేతకు వెళ్లాయి. కొత్తపల్లి, కోలభీమునిపాడు గ్రామాల మధ్యలో ఈర్నపాటి నాగేశ్వరరావు పొలంలో స్తంబాలు పడిపోయి విద్యుత్ ప్రసరిస్తున్న తీగలను తగిలి గేదెలు మృతి చెందాయి. సంఘటనా స్థలానికి పశువైద్యురాలు సౌజన్య చేరుకుని మృతి చెందినట్లుగా నిర్ధారించి ధ్రువ పత్రాన్ని గేదెల యజమానులకు అందించారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు 90 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు.



కోలభీమునిపాడు గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన గేదె

అరుదైన శస్త్ర చికిత్స

పొదిలి, మే 9 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ఉడుముల ఆసుపత్రిలో శుక్రవారం డాక్టర్ గీతికారెడ్డి ఆధ్వర్యంలో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాల్లోకి వెళితే.. 16 సంవత్సరాల వయస్సు కలిగిన బాలిక కడుపులో 2.8 కిలోల బరువున్న అండాశయనీటి గడ్డను ఓపెన్ శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. అనంతరం డాక్టర్ గీతికారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులో ఇంత పెద్ద నీటిగడ్డ రావడం అరుదన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు

- అసంపూర్తిగా మరికొన్ని భవనాలు
- సౌకర్యాలలేమితో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది


ప్రారంభానికి ఎదురుచూస్తున్న సచివాలయ భవనాలు

పామూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, పాలకేంద్రాల భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఆయా భవనాల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో సౌకర్యాలు లేమితో ప్రజలు, సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పామూరు, సీఎస్ పురం మండలాల్లో నిర్మాణ పనులు పూర్తయినవి కొన్ని, అసంపూర్తిగా మరికొన్ని భవనాలు దర్శనమిస్తున్నాయి.

పామూరు మండలంలో 25 గ్రామ పంచాయతీలకుగాను 19 సచివాలయాలు, 19 ఆర్బీకేలు, 18 విలేజ్ క్లీనిక్‌లు మంజూరుచేశారు. నిర్మాణ పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్లు వైసీపీ నాయకుల మాటలు నమ్మి పనులు


అసంపూర్తిగా నిలిచిన రైతు భరోసా కేంద్రం భవనం

చేపట్టి బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. దీంతో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. 19 సచివాలయాల్లో కేవలం 5 మాత్రమే ప్రారంభించారు. మిగిలినవి అన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, హెల్త్‌క్లినిక్‌కు రూ.17.5 లక్షలు, 14 పాలకేంద్రాలకు రూ.17.67 లక్షలు చొప్పున నిధులు మంజూరుచేశారు. సచివాలయాల డిజైన్ మార్పడం కోసం అదనంగా మరో రూ.7 లక్షలు ఖర్చు పెరిగింది. పెరిగిన రూ.7 లక్షలు గ్రామ పంచాయతిలే భరాయించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆర్థికలేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలు సుముఖత వ్యక్తం చేయలేదు. ఈక్రమంలో ప్రభుత్వంపై నమ్మకాలు సన్నగిల్లడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దాంతో అద్దె భవనాల్లో కొనసాగుతూ తగినంత సౌకర్యాలులేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాల్లో విద్యుత్, ఫ్లోరింగ్, టైల్స్, తలుపులు, రంగులు లాంటి సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో అసంపూర్తిగా భవనాలు మిగిలిపోయాయి.

పామూరు పట్టణంలో నాలుగు సచివాలయాలు మంజూరుకాగా, పామూరు-1 భవనం మాత్రమే ప్రారంభమైంది. 2వ సచివాలయం పునాదుల పనులు వరకు నిర్మించారు. 3, 4, సచివాలయాలు ప్రారంభానికి ఎదురుచూస్తున్నాయి. 2, 3, 4, సచివాలయాలు పాత ఆస్పత్రి భవనాల్లో కొనసాగుతున్నాయి. తగినంత సౌకర్యాలు లేకపోవడం, కంప్యూటర్లు మరమ్మతులకు గురి కావడంతో 2, 3, సచివాలయాలు పనిచేయడంలేదు. అందులో ఉండే సిబ్బంది 1, 4, సచివాలయాల్లోనే కలిసి పనులు చేస్తున్నారు. దాంతో ప్రజలకు కావలసిన సేవలు త్వరితగతిన అందటంలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తిచేయించాల్సిన అవసరం ఉంది. ప్రారంభానికి ఎదురుచూస్తున్న సచివాలయాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.2 కోట్లతో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ నిర్మాణం

- 14 నుంచి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

దొనకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాంజనేయస్వామి చల్లటి చూపుతో గ్రామస్థులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలనే ధ్యేయంతో మండలంలోని పడమర వెంకటాపురం పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లి వాసులు దేవాలయ నిర్మాణానికి రెండేళ్ల క్రితం చర్యలు చేపట్టారు. రూ.2 కోట్లతో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. దేవాలయంలో ప్రతిష్ఠించే శ్రీప్రసన్నాంజ నేయస్వామి విగ్రహన్ని అయోధ్యలోని రామమందిరంలో ప్రతిష్ఠించిన బలరాముడి విగ్రహన్ని చెక్కిన మైసూరుకు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్‌రాజ్‌తో విగ్రహాన్ని తయారు చేయించారు. ఆలయం చుట్టూ భక్తులు ప్రశాంత వాతావరణంలో దైవదర్శనం చేసుకొని పూజలు చేసుకునేలా వెంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వరస్వామి, లక్ష్మీదేవి, కనక దుర్గమ్మ అమ్మవారు, మహాశివుడు తదితర దేవుళ్ల మండపాలను అద్భుతంగా నిర్మించారు. దేవాలయ నిర్మాణం పూర్తి కావటంతో ఈనెల 14 నుంచి 16వ తేది వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు.


నిర్మాణం పూర్తయిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలంటూ పూజలు


దేవస్థానంలో పూజలు చేసిన నాయకులు

పామూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): పాక్ ప్రేరిపిత ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో కూటమి సభ్యులు స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పహల్గామ్ దాడికి ప్రతి చర్యగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమవ్వాలని, పాక్ ముష్కరులను మట్టుపెట్టే శక్తి, మనోధైర్యం సైనికులకు ప్రసాదించాలని పూజలు చేసి నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య తెలిపారు. యుద్ధంలో వీర మరణం పొందిన భారత జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉమ్మడిశెట్టి శ్రీను, ఎస్.శివకృష్ణ, కేవీ సుబ్బారావు, డి.చరణ్, పి.విజయ కుమారచారి, షేక్ ఖాజారహంతుల్లా, ఎన్.సాంబయ్య, సత్యం, వి.రాఘవ, శేషం మోషే, శ్రీనివాసులు, చాంద్ బాషా, ఏడుకొండలు, పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ భీమానాయక్

వాహనాల తనిఖీ

పామూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): యుద్ధ సమయంలో అనుమానితులు ప్రయాణించే అవకాశాలు ఉన్నందున పోలీసు ఉన్నతాధి కారుల ఆదేశాలతో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారులపై శుక్రవారం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్ మధ్య ఏర్పడిన యుద్ధవాతావరణంతో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన అండాగా ఉంటామన్నారు. భద్రతా దళాలకు ప్రజలు సంఘీభావం ప్రకటించాల న్నారు. యుద్ధ సమయంలో సంఘ విద్రోహశక్తులు చేలరేగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఏచిన్న సమస్య వచ్చినా నేరుగా పోలీసులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.కిశోర్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

దర్శి, మే 9(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో భూసార పరీక్షలు చేయిం చుకునేందుకు ఎంతో అనువైన సమయమని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ తెలిపారు. ప్రస్తుతం పంట భూములు ఖాళీగా ఉన్నందున పరీక్షల అనంతరం సారవంతమైన మట్టిని అందించే వీలు కల్గుతుందన్నారు. భూసార పరీక్షలతో భూమిలో లోపాలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు భూమిలో లోపాలను తెలుసుకోకుండా పంటల సాగు చేయటం వల్ల సక్రమంగా దిగుబడులు రాక నష్టాలు చవిచూస్తారన్నారు. మట్టి పరీక్షలతో పాటు భూములకు పారించే నీటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. రైతులు తప్పనిసరిగా సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు.


మట్టి, సాగునీటి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రైతులు తప్పనిసరిగా ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని డాక్టర్ రమేష్ కోరారు.

దేవస్థాన నిర్మాణానికి విరాళం

సీఎస్‌పురం(పామూరు), మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులచిలక పంచాయతీ గణేషునిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మింస్తున్న శ్రీఇష్ట కామాక్షి సమేత విశ్వేశ్వరస్వామి నిర్మిణానికి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు రూ.4 లక్షలు విరాళం ప్రకటించారు.

శుక్రవారం గణేషునిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కదిరి పార్థసారథి ద్వారా విరాళాల సొమ్ముకు సంబంధించిన చెక్‌ను దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు.

బాల్యవివాహాలు జరిపితే కఠినచర్యలు

పామూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలు చట్టప్రకారం నేరమని అంగన్‌వాడీ వగ్గంపల్లి సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని నట్టుమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా పునరుత్పత్తి, ఆరోగ్యం, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడానికి విద్య లేకపోవడం ఒక కారణమన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం, ప్రసవ సమయంలో శిశువు మృతి చెందడం లేదా అనారోగ్యంగా నెలలు నిండకముందే జన్మించడం, తక్కువ బరువుతో పుట్టడం జరుగుతాయ న్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్ర మంలో సర్పంచ్ బడ్డిపూడి శారమ్మ, సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ కుమారి, ఎలిజబెత్తమ్మ, లక్ష్మీప్రసన్న, షేక్ ఖాజాబి, రజియాబేగం, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న చిల్లచెట్లు

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

పామూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదాలు పొంచిఉన్నాయి. పట్టణంలోని నెల్లూరు రోడ్డులోగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫీజులకు పిచ్చిమొక్కలు అల్లుకుపోయి ఉన్నాయి. దాంతో తరుచూ ఫీజులు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మరకు ఎలాంటి రక్షణ కవచం లేకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతు న్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కవచం ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

భూసేకరణ పూర్తికి కార్యాచరణ

ఒంగోలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ మొదటి దశ పూర్తి చేసేందుకు ఈనెల 15వ తేదీలోపు కార్యచరణ రూపొందించాలని జా యింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఆయా సంబంధించిన అంశాలపై శుక్రవారం ప్రాజెక్టు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మాట్లాడారు. అసైన్డ్‌మెంట్ భూములకు సంబంధించి ఈనెల 30లోపు పూ ర్తి నివేదికను అందజేయాలన్నారు. మార్కాపు రం, కంభం యూనిట్లలో గ్రామసభలు నిర్వహించి ఆయా సమస్యలను పరి ష్కరించాలని చెప్పారు. ఇళ్ల పట్టాలు, కాలనీల్లో మౌలికసదుపాయాల కల్పన కోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయా పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న సీహెచ్‌వోల సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని పలువురు స్పష్టం చేశారు. సీహెచ్‌వోలు స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవా రానికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క మ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత 11 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత ఏడేళ్ల నుంచి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నా ప్రభుత్వం తమపై కని కరంచూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, జయ శ్రీ, రమేష్, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి 3 గేదెలు మృతి

మార్కాపురం రూరల్, మే 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోలభీముని పాడు గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కోలభీమునిపాడు గ్రామానికి చెందిన మందా సత్యనారాయణరెడ్డికి చెందిన గేదెలు శుక్రవారం ఉదయం పొలానికి మేతకు వెళ్లాయి. కొత్తపల్లి, కోలభీమునిపాడు గ్రామాల మధ్యలో ఈర్నపాటి నాగేశ్వరరావు పొలంలో స్తంబాలు పడిపోయి విద్యుత్ ప్రసరిస్తున్న తీగలను తగిలి గేదెలు మృతి చెందాయి. సంఘటనా స్థలానికి పశువైద్యురాలు సౌజన్య చేరుకుని మృతి చెందినట్లుగా నిర్ధారించి ధ్రువ పత్రాన్ని గేదెల యజమానులకు అందించారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు 90 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు.


ఎంఎస్ఎంఈ పార్క్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

పారిశ్రామిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

దర్శి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని చందలూరులో శుక్రవారం సాయంత్రం ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దర్శి నియోజక వర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే కురిచేడు మండలంలో సీబీజీ ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. దొనకొండలో సోలార్ ప్లాంట్ మంజూరైన విషయం తెలిసిందేనన్నారు. దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ఎంఎస్ఎంఈ పార్క్‌లో ఔత్సాహకులైన పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయించినట్టు చెప్పారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, క్లష్టర్ ఇన్‌చార్జ్ నారపుశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు

వెలిగండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల మండలంలో పలు గ్రామాల్లో పర్యవేక్షక ఇంజనీర్ విజయకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో 15మంది అధికారులు, 70మంది సిబ్బంది 27 బృందాలుగా ఏర్పడి వెలిగండ్ల, మరపగుంట్ల, నాగిరెడ్డిపల్లి, అగ్రహారం, మొగళ్ళూరు గ్రామాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నవారిపై జరిమానాలు విధించారు. మొత్తం 1199 సర్వీసులను తనిఖీచేసి 17 మందికి అపరాధ రుసుం విధించారు. ఈదాడుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (విజిలెన్స్) ఉషారాణి, ఈఈ ఉమాకాంత్, డీఈఈ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ఏఈ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

అంధులకు నైపుణ్యాలపై ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని అంధులకు వృత్తి, సామాజిక జీవితంలో అవలంబించాల్సిన నైపుణ్యాలపై మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నయ్‌లోని అంధుల జాతీయ సాధికార సంస్థ ఈ శిక్షణ ఇస్తుందన్నారు. 2025-26 సంవత్సరంలో మూడు బ్యాచ్‌లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజనం ఉచితంగా అందజేయటంతో పాటు ప్రత్యేక భృతి కూడా ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాల్లోని అంధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు నగరం, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షపై ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడినతరగతుల సంక్షేమశాఖాధికారి, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు అంజల కోరారు. ఈ శిక్షణ కోసం ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలన్నారు. టెట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు.

వివరాలకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

బర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకో వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. బర్లీని పొగాకు కంపెనీలు కొను గోలు చేయాలని కోరుతూ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ప్రై వేటు కంపెనీలు రైతులను ప్రోత్సహించి బర్లీ పొగాకు సాగు చేయించారన్నారు. ఉత్పత్తి ఎంత ఉన్నా కొనుగోలు చేస్తామని నమ్మబలికి తీరా పంట చేతికి వచ్చేసరికి కుంటి సాకులు చెబు తూ రైతులను నట్టేట ముంచారని ఆవేదన వ్య క్తం చేశారు. పండించిన పంటను నిల్వ చేసుకొ నే మార్గం లేక బర్లీ రైతులు అనేక ఇబ్బందులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కంపెనీలతో బర్లీ పొగాకు కొనుగోలు చేయిం చడంతో విఫలమైందని ఆరోపించారు. కంటి తు డుపు మాటలతో సరిపెడుతుందే తప్పా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బర్లీ రైతుల సమస్యల ను పరిష్కరించలేదని దుయ్యబట్టారు. ఇప్పటి కైనా ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించి బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్న య్య, కాకాని సుబ్బారావు, పాలపర్తి యోనా, హజరత్తయ్య, మండవ అంజనేయులు, పలు గ్రా మాల బర్లీ రైతులు పాల్గొన్నారు.

గోవా మద్యం సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్

కంభం, మే 9 (ఆంధ్రజ్యోతి): గోవా మద్యం సరఫరా చేసే మహారాష్ట్రలోని ముంబయిలో నివశించే దేవేంద్రన్ వీరప్పన్‌శెట్టి అనే నిందితుడిని అరెస్టు చేసి కంభంకు తీసుకువచ్చినట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం ముంబాయికి చెందిన దేవేంద్రన్ వీరప్పన్ శెట్టి గోవా మద్యం తెచ్చి కంభం, బేస్తవారపేట మండలాల్లో విక్రయించేవాడని తెలిపారు. తమకు పట్టుబడకుండా ముంబయికి వెళ్ళినట్లు తెలుసుకున్న తాము అక్కడకు వెళ్లి చార్‌కోట్ పోలీసు సహకారంతో వీరప్పన్‌శెట్టిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని బోదివలిలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచి అక్కడ నుంచి శుక్రవారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈఆపరేషన్‌లో గిద్దలూరు ఎక్సైజ్ సీఐ జయరావ్, సిబ్బంది షేక్ షంషేర్, షేక్ రహంతుల్లా, శ్రీనివాసులు పాల్గొన్నట్లు తెలిపారు.

13న పొదిలిలో విద్యుత్ అదాలత్

పొదిలి, మే 9(ఆంధ్రజ్యోతి): పొదిలిలో ఈ నెల 13వతేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ పి.శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. కన్జ్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫొరం విజయవాడ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఫొరం సభ్యులు, ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. దర్శి డివిజన్‌లోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్ళూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. సర్వీస్ కనెక్షన్, పూర్తి అడ్రస్సు, సెల్ నెంబర్‌తో అర్జీ ఇవ్వాలన్నారు. అందులో విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏసమస్యనైనా ఈ సమావేశంలో తెలియజేయాలన్నారు. సమావేశంలో నమోదు చేసుకొన్న సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఉష్ణోగ్రత (అంచనా)

10-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	25
బాపట్ల	38	27
రెంటచింతల	41	26
చీరాల	38	27

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

- జిల్లాస్థాయి అధికారులు ముందుకు రావాలన్న కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): 'బంగారు కుటుంబాలను జిల్లా అధికారులు, గెజిటెడ్ అధికారులు దత్తత తీసుకోవాలి. బంగారు కుటుంబాలు ప్రభుత్వ సదుపాయాలను అందుకునేలా సహకరించాలి. మున్సిపల్ కమిషనర్లు, మండలాధికారులు వారి పరిధిలోని మార్గదర్శకులను ఎన్నుకోవాలి..' అని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. పీ-4, పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజ్లి యోజన అమలుపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తెచ్చేలా మార్గదర్శకులకు అవగాహన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాల్లోని యువతకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కల్పించాలన్నారు. 2027 నాటికి జిల్లాలో అన్ని కుటుంబాలకు సూర్యఘర్ పథకం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, పీడీలు కె.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, డీపీవో ప్రభాకర్, డీఎల్‌డీవోలు విజయలక్ష్మి, పద్మావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో మంత్రి రవికుమార్

అద్దంకి, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 33 మందికి రూ.34.77 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం అద్దంకి మండలంలో పర్యటించారు. ఇటీవల తమిళనాడులో మృతి చెందిన గోవాడకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మాదాల వెంకటేష్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, విజయలను మంత్రి పరామర్శించారు. విద్యుత్ సరఫరా, కొత్తగా స్తంభాల ఏర్పాటు సమస్యలను గ్రామస్థులు తెలపగా వాటిని పరిష్కరించాలని ఈఈ మస్తాన్‌రావుని మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈ శివప్రసాద్‌ను మంత్రి ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం చేసుకుని బిల్లులు పొందని వారికి త్వరలో బిల్లులు వస్తాయని చెప్పారు. పీఐయూ డీఈ రమేష్ బాబు, టీడీపీ నేతలు మానం మురళీమోహన్‌దాసు, పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, నరిశెట్టి వీరరాఘవులు, మాదాల వెంకటేశ్వర్లు, రావిపాటి చన్నయ్య, కోండ్రు కిశోర్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

స్థానికత.. సందిగ్ధం

- 2024లో దరఖాస్తు చేసుకున్న వారికే సర్టిఫికెట్లు
- గత ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతున్న అధికారులు
- రెవెన్యూ అధికారుల తీరుతో డీఎస్సీ అభ్యర్థులకు కష్టాలు

గుంటూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన షేక్ ఫర్హానా యాస్మిన్ కుటుంబం 2015 వరకు హైదరాబాద్‌లో ఉంది. ఆ తర్వాత వారు తిరిగి గుంటూరు వచ్చారు. యాస్మిన్ గుంటూరులోనే చదువుకున్నారు. ఆమె ప్రస్తుతం డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్థానికత సర్టిఫికెట్ కోసం దర ఖాస్తు చేసుకోగా జగన్ ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతూ నిరాకరిస్తున్నారు.

..ఇదే పరిస్థితి అనేకమంది డీఎస్సీ అభ్యర్థులకు ఎదురవుతుంది. రెవెన్యూ అధికారుల సమాధానాలతో వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చిన వారికి రెవెన్యూ అధికారులు సినిమా చూపిస్తున్నారు. స్థానికత అంశాన్ని తేల్చకుండా ఇబ్బందులు పెడుతున్నారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే పొందే స్థానికత సర్టిఫికెట్ కోసం 2024లో దరఖాస్తు చేసుకుని ఉంటే ఇచ్చే వాళ్లమని ఇప్పుడు చెబుతున్నారు. స్థానికత అంశంపై గెజిట్ నోటిఫికేషన్, జీవో 133ని రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కడం ప్రస్తుతం వివాదాస్పదమౌతుంది. ఈ జీవోను పలు మండలాల్లోని రెవెన్యూ అధికారులు పక్కన పెట్టేస్తున్నారు. 2024 జూన్ 1లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్ ఇస్తామని చెబుతున్నారు. గత ప్రభుత్వం అందుకు అనుగుణంగా సర్క్యులర్ జారీ చేసిందని అధికారులు వాదిస్తున్నారు. అయితే 2024 జూన్ 1 లోపు మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం ఎక్కడా ప్రకటన చేయలేదని పలువురు చెప్తున్నారు. ఒకవేళ అలాంటి జీవో ఉంటే లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులతో ముడిపడి ఉన్న ఈ విషయంలో పెద్దగా ప్రచారం కూడా చెయ్యలేదు. ఫలితంగా ప్రస్తుతం వెలువడిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న చాలా మంది అభ్యర్థులు స్థానికత రెవెన్యూ అధికారుల సమాధానాలతో ఏమి చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ గత ప్రభుత్వం అప్పట్లో బహిరంగ ప్రక టన చేసి ఉంటే సర్టిఫికెట్లు పొందే వారమని పలువురు చెప్తున్నారు. ఇప్పుడు పిల్లల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన తర్వాత సర్క్యు లర్ గురించి ఇప్పుడు అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో జోక్యం చేసుకుని గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



జీవో 133 ఏమి చెబుతుందంటే..

2014లో రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం కొన్ని కీలక అంశాలపై ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. 2016 జూన్ 13న వెలువరించిన జీవో 133 కూడా అటువంటిదే. ఈ జీవో ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన తేదీ నుంచి మూడేళ్ల కాలంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారిని మాత్రమే ఆయా జిల్లాల్లో స్థానికులుగా పరిగణలోకి తీసుకోవాలి. ఆ తర్వాత ఆ గడువును ప్రభుత్వం రెండు సార్లు మార్చింది. తెలంగాణ నుంచి ఆయా జిల్లాలకు వచ్చిన వారికి జీవో 133 ప్రకారం వారిని స్థానికులుగా గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేయాలి.

బోధకులు లేక బాధలు

- 80 ప్రొఫెసర్ పోస్టులకు 71 ఖాళీ
- నరసరావుపేట జేఎన్టీయూలో అతిథులే దిక్కు
- 2018 నుంచి నియామకాలపై వర్సిటీ పెద్దల నిర్లక్ష్యం
- బోధన సాగక.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లేక విద్యార్థుల అవస్థలు

ఐదు బ్రాంచ్‌లు.. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న నరసరావుపేట జేఎన్టీయూ (కే) కళాశాలలో బోధకులు లేరు. 80 మంది ప్రొఫెసర్లకు 71 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తొమ్మిది మంది ప్రొఫెసర్లకు ఇద్దరే ఉన్నారంటే ఏమేరకు ఇక్కడ విద్యా బోధన జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బోధకులు లేక.. విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు ఇప్పటికీ అధ్యాపకులను వర్సిటీ నియ మించలేదంటే కళాశాలపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుసుకోవచ్చు. ఏళ్లుగా అతిథి అధ్యాపకులతోనే సరిపెడుతున్నారు. నరసరావుపేట సమీపంలో జేఎన్టీయూను 2016లో ప్రారంభించిన కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్టీయూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలున్నాయి. పోస్టుల భర్తీతో పాటు ఇతర అనేక సమస్యలతో కళాశాలలో విద్యార్థులు బాధలు పడుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు స్థాపించిన కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జేఎన్టీయూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. ఇక్కడ సీటు కోసం విద్యార్థులు పోటీ పడుతుంటారు. అత్యుత్తమ బోధన.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లే ఇందుకు కారణం. కానీ నరసరావుపేటలోని జేఎన్టీయూలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ సీటు వస్తున్నా వద్దని విద్యార్థులు వేరే దగ్గరకు వెళ్లిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయినా లోటుపాట్లను సవరించి ప్రతిష్ఠను మెరుగుపరచాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నరసరావుపేటలోని కళాశాలలో వసతుల మాట ఎలా ఉన్నా విద్యా బోధనకు గ్రహణం పట్టింది. పర్మినెంట్ అధ్యాపకులు తొమ్మిది మంది మాత్రమే ఉండగా వారిలో ఒకరు ప్రిన్సిపాల్. మొత్తం 71 మంది అధ్యాపకుల కొరత ఉంది. 22 మంది కాంట్రాక్టు, 18 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో పనిచేసే వారిని నామమాత్రంగా నియమించారు. అధ్యాపకుల నియామకంలో వర్సిటీ వ్యవహరిస్తున్న తీరు దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలపై వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న ఆరోపణలకు ఇక్కడ నెలకొన్న పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అటు పాలకులు.. ఇటు జేఎన్టీయూ కాకినాడ వర్సిటీ అధికారులు కళాశాల నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు నిధులు.. విద్యార్థులకు అవసరమైన వసతులు.. అధ్యాపకుల కొరతను వర్సిటీ పట్టించుకోకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని పలువురు మండిపడుతున్నారు. బోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశాలను నిర్వీర్యం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ఎంపికే ఇందుకు ఆధారం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లను నియమించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఆలోచన వర్సిటీ పెద్దల్లో లోపించింది.

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్న వారు	ఖాళీ
ప్రొఫెసర్	9	2	7
అసోసియేట్లు	18	1	17
అసిస్టెంట్లు	53	6	47

ప్రాంగణ ఎంపికలు ఇలా..


సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	153
2025	72



నరసరావుపేట జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

భవనాసికి.. భూసేకరణ భారం

- రూ.4.20 కోట్ల నుంచి 40 కోట్లకు పెరుగుదల
- 2009 నుంచి సా..గుతున్న రిజర్వాయర్ నిర్మాణం
- రూ.27 కోట్లతో ప్రారంభం.. వంద కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- ఎమ్మెల్యేగా గొట్టిపాటి శంకుస్థాపన.. మంత్రి హోదాలో పూర్తి చేస్తారని ఆశ



అద్దంకి, మే 9 (ఆంధ్రజ్యోతి): 16 సంవత్సరాలు గడిచింది.. అంచనా వ్యయం రూ.27 కోట్ల నుంచి రూ.100 కోట్లు పెరిగింది.. భూసేకరణ వ్యయం రూ.4.20 కోట్ల నుంచి రూ.40 కోట్లు పెరిగింది.. అయినా ఇంకా భవనాసి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాలేదు. అసలు ఇది ఎప్పటికి పూర్తి అవుతుందంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు. రిజర్వాయర్‌కు చక్రాయపాలెం వద్ద 2009 జూన్‌లో అద్దంకి ఎమ్మెల్యే హోదాలో గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. రూ.27 కోట్లతో 4 ప్యాకేజీలుగా విభజించి పనులు మొదలు పెట్టారు. అప్పట్లోనే చెక్‌డ్యామ్, చెరువు అభివృద్ధి పనులు అత్యధికశాతం పూర్తయ్యాయి. గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు వరకు తవ్వే కాల్వ పనుల్లో కొన్నిచోట్ల పెద్ద బండరాళ్లు ఉండటంతో బ్లాస్టింగ్‌కు అనుమతులతో పనులు ఆలస్యమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.45 కోట్లకు చేరగా కొంతమేర పనులు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అంచనాలను రూపొందించగా అది రూ.80 కోట్లకు చేరింది. అప్పట్లో పనులకు అనుమతులు రాలేదు. ప్రస్తుతం అంచనాలు రూపొందించగా వ్యయం రూ.100 కోట్ల దాటిందని సమాచారం. ప్రధానంగా భూసేకరణ వ్యయం పెరగడానికి ప్రధాన కారణం అప్పట్లో భవనాసి చెరువు పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు కాగా ప్రస్తుతం అవి చేపల చెరువులుగా మారడంతో పరిహారం భారీగా పెరిగిందని తెలుస్తోంది.


మంత్రి రవికుమార్‌పైనే ఆశలు

ఎమ్మెల్యేగా గొట్టిపాటి శంకుస్థాపన చేసిన భవనాసి రిజర్వాయర్ పనులు సుమారు 16 ఏళ్లుగా పూర్తి కాలేదు. నాడు శంకుస్థాపన చేసిన గొట్టిపాటి ఇప్పుడు మంత్రిగా ఉన్నారు. దీంతో మంత్రి హోదాలో రిజర్వాయర్ పనులు పూర్తవుతాయనే ఆశతో రైతులు ఉన్నారు. పనులపై ఇప్పటికే ఉన్నతాధికారులతో సమీక్షించిన రవికుమార్ మళ్లీ కొత్త అంచనాలను తయారు చేయించి సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.



చిల్లచెట్లతో మూసుకుపోయిన గుండ్లకమ్మ నుంచి రిజర్వాయర్‌కు తవ్విన కాల్వ

రైతు బంధ్



- రుణం అందక రైతుల గగ్గోలు
- ప్రకటనల్లోనే రైతుబంధు పునరుద్ధరణ
- మూడు జిల్లాల్లో గతేడాది రూ.15 కోట్లు కేటాయింపు
- ప్రచారానికే పరిమితం.. రైతులకు ప్రయోజనం నామమాత్రం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గడం.. అయినకాడికి అమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోవడం రైతులకు పరిపాటిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ గోడౌన్లలో నిల్వ చేసుకుంటే నామమాత్రపు అద్దె వసూలుతో పాటు నిల్వ చేసుకున్న పంట విలువలో 70 శాతం రుణం రూపేణా అందించేది. దీని వల్ల రైతులు ఉత్పత్తులను సరైన ధరకు అమ్ముకోవడానికి కొంతమేర వెసులుబాటు దొరికేది. కానీ గత ప్రభుత్వంలో ఈ పథకం ఆనవాళ్లు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో రైతుబంధు పథకం పునరుద్ధరణపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగా గతేడాది అక్టోబరులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఈ పథకం కింద రూ.15 కోట్లు కేటాయించింది. కానీ అది ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆ ఫలాలేవీ తమకు అందలేదని రైతులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాకు రూ.4 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.5 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.6 కోట్ల విడుదలకు అనుమతులిచ్చింది. మూడు జిల్లాల పరిధిలో రూ.15 కోట్ల వరకు నిధుల కేటాయింపు జరిపితే అంతా కలిపి కోటి రూపాయలు కూడా రైతులకు మేలు జరగలేదు. బాపట్ల జిల్లాలో 9 మంది రైతులకు రూ.15లక్షల రుణ సదుపాయం కల్పించి మమ అనిపించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న చందంగా ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ ఫలాలు రైతులకు అందలేదు.

2014-19 మధ్య ముమ్మరం

రైతుబంధు పథకం 2014--19 మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున అమలైంది. పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకుని ఏడాదికి దాదాపు రూ.45 కోట్ల వరకు రుణాలను రైతులు తీసుకున్నారు. నిల్వకు నామమాత్రపు అద్దె, నిల్వ చేసిన దిగుబడిలో 70 శాతం మొత్తం తక్కువ వడ్డీకి తొమ్మిది నెలల గడువు రుణంతో రైతులకు మేలు జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పథకం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం ధర బహిరంగ మార్కెట్‌లో ఆశాజనకంగా లేదు. కొన్ని పరిమితులకు లోబడే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించింది. గడచిన ఖరీఫ్, ప్రస్తుతం ధాన్యం ధర మద్దతు రేటుకన్నా బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.300 వరకు తీసికట్టుగానే నమోదైంది. అయినా రైతుబంధు పథకంలో ధాన్యాన్ని నిల్వ చేసుకునే పరిస్థితులు లేక రైతులు తెగనమ్ముకుని నష్టాలు పాలయ్యారు. లక్షల టన్నుల ధాన్యం తక్కువ ధరకు దళారీల పాలైంది. రైతుబంధు పథకం ద్వారా రుణం ఇచ్చి ఉంటే అప్పులు తీర్చుకొని ఉండేవాళ్లమని రైతులు తెలిపారు.

గోదాముల విషయంలోనూ నిర్లక్ష్యం..

గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాలరాసి ఏకంగా మార్కెటింగ్ గోడౌన్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చింది. దీంతో రైతులకు అటు రైతుబంధు ఫలాలు ఎండమావిగా మారడంతో పాటు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పుడు కూడా గోదాముల విషయంలో దాదాపుగా అదే నిర్లక్ష్యం కొనసాగుతూ ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డుల్లో 178 వరకు గోదాములు ఉన్నాయి. వీటిలో దాదాపు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ గడచిన ఖరీఫ్ సీజన్‌లో మార్కెటింగ్ గోదాముల్లో నిల్వ చేసుకున్న ధాన్యం అంతా కలిపి కూడా 50,000 టన్నులకు మించలేదు. గోదాములలో నిల్వ సామర్థ్యం అంతంతమాత్రంగా ఉండడం కూడా రైతుబంధు పథకం అమలుకు ప్రతిబంధకంగా మారినట్లు తెలుస్తోంది.



బాపట్ల మార్కెట్ యార్డులోని గోడౌన్

12లోపు మ్యూటేషన్ చేయించుకోవాలి

పంగులూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే జరుగుతున్న కొండమూరు గ్రామంలో ఈ నెల 12వ తేదీలోగా రైతులు తమ భూములు మ్యూటేషన్ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ సింగారావు ఒక ప్రకటనలో కోరారు. కొండమూరు గ్రామంలో ఫేజ్-2 కింద రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. చనిపోయిన ఇతరుల కింద నమోదైన భూములు, కొనుగోలు ద్వారా సంక్రమించిన భూములు, అనుభవసాగులో ఉండి రికార్డులలో పేరు నమోదుకానివారు తమ భూములు నిర్దీత వ్యవధిలో మ్యూటేషన్ చేయించుకోవాలన్నారు. 10, 11 తేదీలలో వీఆర్వోతో పాటు సిబ్బంది కొండమూరు సచివాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

నేటినుంచి భీమలింగేశ్వర స్వామి వార్షికోత్సవం

పంగులూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయ 21 వార్షిక మహోత్సవం 10 నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని ఈవో శ్రీనివాసరావు చెప్పారు. 10వ తేదీ సాయంత్రం 7గంటలకు విఘ్నేశ్వర పూజతో వార్షికోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం, 7 గంటలకు రాయబారం, 8 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరుగుతందని పేర్కొన్నారు. 12వ తేదీ తిరునాళ్ల, 7 గంటలకు శ్రీ రాస భారతీయ కళాక్షేత్రం అద్దంకి వారి కోలాట ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. 13వ తేదీ పూజా కార్యక్రమాలు, పూర్ణాహుతి, అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. మంగళవారం రాత్రి శ్రీ సాయి నాట్య కళాభారతి, యస్.సరస్వతి శిష్య బృందం ఒంగోలు వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

12న కడవకుదురులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

చినగంజాం, మే 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామదేవత పోలేరమ్మతల్లి తిరునాళ్లను పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీ ఉదయం 9గంటలకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.5,116, రూ.3,116, రూ.2,116 అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రెండు రూపాయిలు, తుది నిర్ణయం కమిటీ వారిదేనని వివరించారు. వివరాలకు 9381797620, 9010324747, 9666377546, 9505272650, 7013806905 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

కలెక్టర్ సేవలు ఎనలేనివి



కలెక్టర్ మురళీను సత్కరిస్తున్న ఏడీ నాగమల్లేశ్వరరావు

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో, పథకాల అమలు తీరు తెన్నులో జిల్లా కలెక్టర్ వెంకటమురళీకి ప్రత్యేక శైలి ఉందని, ఆయన సేవలు ఎనలేనివని జిల్లా హ్యాండ్లూమ్స్ ఏడీ కిలారి నాగమల్లేశ్వరరావు చెప్పారు. గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ ఉత్తమ బంగారు అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా హ్యాండ్లూమ్స్ ఏడీ కలిసి దుశ్శాలువాలతో ఘన సత్కారం అందించారు.

రోడ్ల మరమ్మతులను పర్యవేక్షణ చేయరా..

బాగున్న మార్జిన్లను చెడగొడుతుంటే ఏమి చేస్తున్నారంటూ ఆర్‌అండ్‌బీ డీఈపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి రవికుమార్

రూ.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి

అద్దంకి నియోజకవర్గంలో పలు రహదారులకు మోక్షం



తారు రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల మరమ్మతుల సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు ఎలా చేస్తారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహారావుపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని గోవాడకు వచ్చిన మంత్రి రవికుమార్ దృష్టికి శింగరకొండపాలెం-అంబడిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులను ఆయన పరిశీలించారు. ఆ సమయంలో గ్రామస్తులు మాట్లాడుతూ మార్జిన్లు గతంలో పటిష్టంగా ఉండగా, ప్రస్తుతం ఎక్స్‌కవేటర్‌తో తవ్వటంతో బలహీనంగా మారుతున్నాయని, వర్షాకాలం కోతకు గురవుతాయని చెప్పటంతో మంత్రి వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్‌లో డీఈ పొంతన లేకుండా సమాధానం చెప్పటంపైనా అసహనం వ్యక్తం చేశారు. రోడ్ల పనులు జరిగే సమయంలో కచ్చితంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా చూడాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో దమ్ము చక్రాల ట్రాక్టర్లు తారురోడ్లపై తిరగకుండా ఆయా గ్రామాల ప్రజలే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం నామ్ రోడ్డు నుంచి గోవాడ వరకు సుమారు 1.20 కోట్ల రూపాయల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 50 కోట్ల రూపాయలతో తారు రోడ్ల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఇప్పటికే 14.56 కోట్ల రూపాయల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో 11 రోడ్లు, 9.85 కోట్ల రూపాయల నాబార్డు నిధులతో శాంతినగర్-ఏలేశ్వర వారిపాలెం, కొప్పెరపాడు-జమ్మలమడక రోడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి 14 పనులకు సంబంధించి 23.85 కోట్ల రూపాయలు త్వరలో నిధులు మంజూరు కానున్నాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్లను వచ్చే నాలుగేళ్లలో తారురోడ్లుగా మార్చనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఐయూ డీఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నాపై సీఐడీ విచారణ చేయించాలి

గతంలోనే నేను చీరాల అసెంబ్లీ అభ్యర్థిగా టీడీపీ నుంచి బరిలోకి

రాజకీయ పరిణామాల నేపథ్యంలో గత ఎన్నికల్లో వైసీపీకు మద్దతు

తిరిగి టీడీపీ అధిష్టానం కోరిక మేరకే పార్టీ తీర్థం

ఆమంచిపై పలు ఆరోపణలు

విలేకరుల సమావేశంలో మునిసిపల్ చైర్మన్ జంజనం



ఆమంచిపై గతంలో ప్రచారం నిర్వహించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్న మునిసిపల్ చైర్మన్ జంజనం

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధికే గానీ అవినీతికి చోటులేకుండా పాలన సాగించానని, కొంత మంది కావాలనే తనపై అవినీతి ఆరోపణలు చేసి అవిశ్వాసం పెట్టారని వెంటనే తనపై సీఐడీ, సీబీసీఐడీ, విజిలెన్స్ అధికారులు విచారణ చేయాలని మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనే ఆమంచి సాగించిన ఘోరాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేసినట్లు గుర్తుచేశారు. అందుకు సంబంధించిన కరపత్రాలను సైతం ప్రదర్శించారు. మరొక వైపు కరణం బలరామకృష్ణమూర్తి చీరాల ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలు మార్లు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకోనివ్వకుండా ఆమంచి కవ్వింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బలరాంకు మద్దతు తెలిపామని, తనపై కక్ష బూని చైర్మన్ పదవి నుంచి తొలగించేందుకు ఆమంచి ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. అవిశ్వాసం అధిష్టానం ఆదేశమని, ఎమ్మెల్యే కొండయ్యతో సానుకూలంగా, వివాదాలు లేకుండా ప్రయాణం చేస్తానని జంజనం చెప్పారు. గతంలోనే తాను టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. సహచర కౌన్సిలర్లతో భేదాభిప్రాయాలు లేవన్నారు. చీరాల్లో టీడీపీకు ఆమంచి కృష్ణమోహన్ తీరని ద్రోహం చేశారని, టీడీపీ తీర్థం పుచ్చుకునే ఆ పార్టీని నిర్వీర్యం చేశారని జంజనం ఆరోపించారు.

ముక్తేశ్వరంలో ఈదురు గాలులు

పడిపోయిన రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు

రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం

అంటున్న బాధితులు



ముక్తేశ్వరంలో ఈదురు గాలులకు పడిపోయిన రేకుల షెడ్డు



గాలి ప్రభావానికి పడి పోయిన విద్యుత్ స్తంభాలు

బల్లికురవ, మే 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గురువారం రాత్రి ఈదురు గాలి భారీ వర్షం భీబత్సం సృష్టించింది. రెండు గంటల మేర వీచిన గాలుల ప్రభావానికి రెండు రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అందిన సమాచారం మేరకు... ముక్తేశ్వరం రైస్ మిల్లు సమీపంలో ఉన్న తోట అంకమ్మరావు సుమారు రూ.4 లక్షలు వెచ్చించి ఇటీవల పశువులకు రేకుల షెడ్డు వేశారు. ఈదురు గాలి ప్రభావానికి షెడ్డు మొత్తం నేలమట్టమైంది. ఇదే గ్రామంలో సూరేపల్లిరోడ్డులో ఉన్న రావువారి పోతురాజు వేసుకొన్ని రేకుల షెడ్డు కూలిపోయింది.

ప్రమాద సమయంలో షెడ్డులో ఎవరూ లేరు. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చినగంజాం, మే 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.పాపారావు, రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరెడ్డిలు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ చినగంజాం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ సాటిన విద్యార్థులకు గౌరవ పురస్కారాలు అందజేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మండల పరిధిలోని కేజీబీవీ, పెదగంజాం, రాజుబంగారుపాలెం, చినగంజాం, పెదపల్లెపాలెం, కడవకుదురు, అడవీధిపాలెం జడ్పీ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 14 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ముందుగా యూటీఎఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.భిక్షాలు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, ఉపాధ్యక్షులు సీహెచ్.వెంకట్, జిల్లా కౌన్సిలర్లు పీ పోతురాజు, జీ అంకమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం సుమాంజలి, పెదగంజాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎండీ నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ నరసింహారావు, ఆర్ పోతురాజు, ఎ నరసింహారావు, కేవీ సుబ్రమణ్యం, యూ సాంబశివరావు, వై.రామాంజనేయులు, సీఆర్పీ సురేంద్ర పాల్గొన్నారు.

12న త్రివిక్రమ అగస్తేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చెరుకూరు(పర్చూరు), మే 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ త్రివిక్రమ, అగస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి బి.నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10న బలిహారణోత్సవాల అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. 11న స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కారంచేడు/పర్చూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో ఝాన్సీ చెప్పారు. శుక్రవారం కారంచేడు పంచాయతీ కార్యాలయం సమీపంలోని గ్రామ సచివాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతో పాటు ప్రోత్సహించే వారు కూడా శిక్షార్హులేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ హిమబిందు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యలకు వేగవంతంగా పరిష్కారం

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌తో ప్రజా సమస్యలు నేరుగా తెలుస్తున్నాయని, తద్వారా పరిష్కారం వేగవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 750 అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పూజలు

ప్రజా సేవా కార్యక్రమాలతో పాటు, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఎమ్మెల్యే కొండయ్య బాల కొండమ్మ దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక గొల్లపాలెంలోని శివాలయంలో కుమారులు నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమమర్నాథ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చీరాలను కొండయ్య మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారు

రిటైర్డ్ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ

నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కొండయ్య మోడల్‌గా తీర్చిదిద్దుతారని రిటైర్డ్ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ చెప్పారు. శుక్రవారం వేటపాలెం మండలం రామన్నపేటలో డాక్టర్ పొగడదండ రవికుమార్‌కు చెందిన హొరిజన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ఇరువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. ఈసందర్భంగా జేడీ చీరాల - పేరాల ఉద్యమం, గాంధీజీకు చీరాలతో ముడిపడి ఉన్న అంశాలు, వేటపాలెం గ్రంథాలయం వంటి ప్రముఖ అంశాలను వివరించారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలోనే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, తిరిగి నాలుగేళ్లలో ఒక్కసారైన ఏదో ఒక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరవుతానని జేడీ చెప్పారు.



పూర్వపుజేడీ లక్ష్మీనారాయణతో ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధి పనులకు ప్రజలు మంత్రముగ్ధులు

రాష్ట్రంలో టీడీపీ కూటమి అభివృద్ధి పనులు చూస్తున్న ప్రజలు హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. మునిసిపాలిటీలోని 20, 21, 22 వార్డులకు చెందిన 200 కుటుంబాలు క్యాంపు కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే, నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టరు మహేంద్రనాథ్ పార్టీ కండువా కప్పి స్వాగతించారు. గతంలో జగన్ ప్రభుత్వం చేసిన దారుణాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లారీ ఢీకొనడంతో కూలీ మృతి

అవీఇవీ

పొట్టకూటికి వెళుతూ అనంత లోకాలకు

విగతజీవిగా ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరైన భార్య

చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద మిన్నంటిన రోదనలు



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమారులు(ఇన్‌సెట్లో) సురేష్(ఫైల్)

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే... స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కుంచాల సురేష్(35), శ్రావణి దంపతులు. వీరికి ముగ్గురు కుమారులున్నారు. సురేష్ రోజువారీ కూలీతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తన్నీరు సురేష్‌తో కలిసి కుంచాల సురేష్ ద్విచక్రవాహనంపై కఠారిపాలెంలో బేల్దారీ పని కోసం బయలుదేరారు. ఈక్రమంలో మన్నం అపార్ట్‌మెంట్ వద్దకు రాగానే జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఉండటంతో బైక్‌ను నిదానం చేశారు. అదే సమయంలో చీరాల పట్టణంలో ఫ్యాన్సీ స్టోర్ లోడు దించి విజయవాడకు వెళుతున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కుంచాల సురేష్ మాత్రమే తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స కోసం గుంటూరుకు సిఫార్సు చేశారు. బంధువులు అంబులెన్స్‌లో ఎక్కిస్తుండగానే తుదిశ్వాస విడిచాడు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

సాయంత్రం ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తానని చెప్పి...

పనికి వెళ్లి పెందల కడనే వస్తా.. ఎగ్జిబిషన్‌కు వెళదామని కుంచాల సురేష్ ఉదయాన్నే చెప్పి పనికి వెళ్లాడు. అలా వెళ్లిన గంట తరువాత చీరాల ఏరియా వైద్యశాలలో శవమై కనిపించాడు. లోకం తెలియని ముగ్గురు పసి కందులు తల్లి శ్రావణిని హత్తుకుని బోరున విలపించారు. 'ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తానంటివే లే నాన్న' అని పిల్లలు రోదించడం అందర్నీకలచివేసింది. వారిలో ఒక బాబు హాస్పిటల్ గ్రిల్స్ పట్టుకుని రోదిస్తుంటే వదిలించడం పెద్దల తరం కాలేదు.

కారును ఢీకొన్న టిప్పరు.. వ్యక్తికి స్వల్పగాయాలు

మార్టూరు, మే9 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయరహదారిపై ఒంగోలు వైపు వెళుతున్న కారును వెనుక నుంచి టిప్పర్ ఢీకొన్న సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి వెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బండారు వెంకటేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి. అతను పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. మండలంలోని జొన్నతాళి గ్రామానికి అతను సొంత పనుల నిమిత్తం ఉదయం చిలకలూరిపేట నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా గాయపడిన అతనిని ద్విచక్రవాహనంపై పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోధనోపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : బుద్ధిమాంద్యత వలన బడి వరకు నడవలేక ఇంటి వద్దనే విద్య పొందుతున్న ప్రత్యేక అవసరాల గల చిన్నారులు సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న ప్రత్యేక బోధనోపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బూధాటి సుధాకరరావు చెప్పారు. శుక్రవారం స్థానిక భవిత విద్యా వనరుల కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన ప్రత్యేక టీచింగ్ మెటీరియల్ కిట్లను చిన్నారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఒక్కొక్క కిట్ విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాధం బాబురావు, కందుల గంగాధర్, సీఆర్పీ రామకృష్ణ, ఐఈఆర్‌టి కొంగల శ్రీనువాస్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు వెన్నులో వణుకు



సంఘీభావ కార్యక్రమం నిర్వహిస్తున్న పట్టణ ప్రజలు

అద్దంకిటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ భారతను ఉగ్రవాదంతో రెచ్చగొడితే ఆదేశానికి వెన్నులో వణుకు మొదలైందని, భారతదేశం అంటే ఎంటో ఆపరేషన్ సిందూర్ తెలియజేసిందని రిటైర్డ్ సైనికులు చాగంటి శేషారెడ్డి చెప్పారు. శుక్రవారం అద్దంకిలో నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం కార్యక్రమం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ భారత్‌లో ఉన్న 140 కోట్ల మంది ఒక్కసారిగా కన్నెరజేస్తే పాకిస్తాన్ మాడిమసై పోతుందని, ఉగ్రవాదానికి ఇవి చివరి రోజులని చెప్పారను. యుద్ధంలో అమరులైన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించి, కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాగినేని రామకృష్ణ, చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ ఖాసీంసాహెబ్, మహబూబ్, దివాకర్ దత్తు, రఘుచంద్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, పవన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

మేదరమెట్ల, మే 9(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు చెప్పారు. కొరిశపాడులో నిర్వహిస్తున్న నవధాన్యాల కిట్ల తయారీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు నవధాన్యాల కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అశోక్, జాను, శ్రీనివాసరావు, మౌనిక, ప్రియాంక, శిరీషా, గౌరి, అంజలి, కరీమూన్, రైతులు పాల్గొన్నారు.

ఎండిన చింతచెట్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎండిన చింతచెట్లను తొలగిస్తున్న కూలీలు

పర్చూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - ఇంకొల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో ఎండిపోయిన చింత చెట్లు ప్రమాదానికి నిలయంగా మారాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఎండిపోయిన చింత చెట్ల కింద నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎండిపోయిన కొమ్మలు పడి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు నిత్యం ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండిపోయిన చింత చెట్లతో పొంచిఉన్న ప్రమాదం అనే కథనం ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఎండిన చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

బల్లికురవ, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు ఎస్సీ కాలనీలో రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదం సంభవించి రెండు కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శుక్రవారం అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పానెం హనమిరెడ్డి బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు తదితరులు ఉన్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.7	26.7
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	28
కందుకూరు	37	28



దేశ సంరక్షణ, శత్రు వినాశనం కోసం శుక్రవారం నగరంలోని మూలాపేటలోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు శ్రీరామ రుద్ర పారాయణం చేశారు. ప్రభుత్వానికి, సైనికులకు మద్దతుగా ప్రత్యేక పూజలు చేశారు.

పోలీసుల అప్రమత్తం

- జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

నెల్లూరు (క్రైం) : ఓ పక్క పాకిస్థాన్‌పై యుద్ధం.. మరోపక్క కేంద్ర ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటనతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేస్తూ రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నాయి. పాక్‌తో యుద్ధం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలు, లాడ్జీల తనిఖీలను ముమ్మరం చేశారు. ఇక జిల్లా పరిధిలోని తీర ప్రాంతాలపై మెరైన్, స్థానిక పోలీసుల సహకారంతో నిఘా నేత్రం ఉంచారు. ఎస్పీ జి కృష్ణకాంత్ శుక్రవారం కృష్ణపట్నం పోర్టు, జెన్‌కోలను పరిశీలించి పలు అంశాలపై అధికారులతో సమావేశం అయ్యారు.

- తీర రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం : ఎస్పీ

ముత్తుకూరు : తీర రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. దేశ సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తీర ప్రాంతాల్లో అప్రమత్తమై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించేందుకు శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్టు, జెన్‌కో అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. పోర్టు, జెన్కో థర్మల్ కేంద్రం భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. తీర ప్రాంతాలపై యుద్ధ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరి సహకారంతో పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టి, నిఘా ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్, జెన్‌కో సీఈ మధుసూదన్ రావు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



జెన్‌కో అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారు. మన ఆడపడుచుల పసుపు, కుంకుమను తీసేసిన వారిపై మనోళ్లు ప్రతీకారం తీసుకున్నారు. ఇంతటి క్షోభకు కారణమైన పాకిస్థాన్‌నూ వదిలి పెట్టకూడదు. ఈ యుద్ధంలో మా వాళ్లు పాలుపంచుకోవడం ఎంతో గర్వంగా ఉంది. అలాగని భయంగా కూడా ఉంది.' అంటూ దేశ సరిహద్దులో శత్రు దేశంతో పోరాడుతున్న మన జవాన్ల తల్లిదండ్రులు భావోద్వేగంగా అంటున్నారు. 'దేశం కోసం మా వాళ్ల పోరాటం మాలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది.' అని కన్నీటి చెమ్మను తుడుచుకుంటూ చెబుతున్నారు. దేశ సరిహద్దులో పోరాడుతున్న సైనికుల్లో జిల్లాకు చెందిన వారూ ఉన్నారు. అలాంటి వారి బంధువులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

భయంగా ఉన్నా.. గర్విస్తున్నాం!

ఉగ్రవాదాన్ని పూర్తిగా అణిచేయాలి
పాక్‌కు సరైన బుద్ధి చెప్పాలి
'ఆంధ్రజ్యోతి'తో సైనిక కుటుంబసభ్యులు



మహేశ్ తల్లిదండ్రులు నరసింహులు, వెంకటమ్మ

దేశం కోసం పోరాడుతున్నాడు!

మా అబ్బాయి తోట మహేశ్ ఐదేళ్ల క్రితమే భారత ఆర్మీలో చేరాడు. దేశం కోసం పోరాడుతున్నందుకు మాకు గర్వంగా ఉంది. యుద్ధం సన్నాహాలు మొదలైన నాటి నుంచి మాకు రోజు ఫోన్ చేసి మాట్లాడుతున్నాడు. ఇప్పుడు జమ్మూ కశ్మీర్ సరిహద్దులో ఉంటున్నట్లు చెప్పాడు. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు, దేశం కోసం పోరాడుతున్న మా మహేశ్‌ను చూసి గర్వపడుతున్నాము.

- తోట నరసింహులు, వెంకటమ్మ, సీతారామపురం

పట్టుబట్టి చేరాడు!



మాది చేనేత పేద కుటుంబం. మా కుమారులు రంగనాయకులు, రంగనాథంలను కష్టపడి చదివించాం. రెండో అబ్బాయి రంగనాథం పట్టుబట్టి మమ్మల్ని ఒప్పించి ఆర్మీలో చేరాడు. ఆర్మీలో జవాన్‌గా సెలెక్ట్ అయి ట్రైనింగ్ పూర్తి చేసుకుని 2004లో తొలి పోస్టింగ్ రాజస్థాన్‌లో చేరాడు. పోయిన సంక్రాంతికి ముందు వచ్చాడు. నెలన్నర కిందటే డ్యూటీ కి వెళ్లాడు. ప్రస్తుతం యుద్ధం జరుగుతుండటం, ఇందులో మా రంగనాథం పాల్గొనడం గర్వంగా ఉంది. కశ్మీర్ పర్యాటకులపై దాడి చేసి చంపిన ఉగ్రవాదులను మన సైనికులు మట్టుబెట్టడంతో సంబరపడ్డాం. దేశ ప్రజలందరూ మన సైనికులను కీర్తిస్తుండటం అందులో మావాడు ఉండడంతో చాలా గర్వంగా ఉంది.

- వింజమూరి రంగస్వామి, వెంగటమ్మ, సంగం



సురేష్ తల్లి విజయమ్మ, భార్య జ్యోతి, పిల్లలు

మాకే ధైర్యం చెబుతున్నాడు!

కలువాయి మండలం మాదన్నగారిపల్లెకు చెందిన ఆవుల వెంకటసుబ్బయ్య, విజయమ్మల కుమారుడు ఆవుల సురేష్ 12 ఏళ్లుగా బీఎస్ఎఫ్‌లో జవానుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పంజాబ్‌లో కూడా పని చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో మూడేళ్ల సర్వీసు పూర్తికావడంతో ఇటీవల కశ్మీర్‌కు బదిలీ చేశారు. నెల రోజులు సెలవులు తరువాత కశ్మీరులో జాయిన్ కావాల్సి ఉంది. అయితే, యుద్ధం నేపథ్యంలో సెలవులు రద్దు చేయడంతో అరుణాచల్ ప్రదేశ్‌లోనే ఉంటున్నారు. ఈ సందర్భంగా సురేష్ తల్లి ఆవుల విజయమ్మ, భార్య జ్యోతి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు 'మనదేశం కోసం సరిహద్దులో విధులు నిర్వహిస్తూనే మాకు ఫోన్‌లో అనుక్షణం ధైర్యం చెబుతున్న మా కుమారుడిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. ప్రతి రోజూ మాకు ఫోన్ చేసి ఎంతో ధైర్యం చెబుతున్నాడు. మీరు భయపడకండి ఏమీ కాదు అంటూ సురేష్ చెబుతున్న మాటలు ఎంతో గర్వంగా ఉన్నాయి.'

మాకెంతో చాలా గర్వంగా ఉంది!



మా ఆయన మాధవరావు 28 ఏళ్లుగా కశ్మీర్‌లో సైనికుడిగా పని చేస్తున్నాడు. ఇక ఆయనకు ఒక్క ఏడాది మాత్రమే సర్వీస్ ఉంది. ఈ ఏడాదిలోనే ప్రమోషన్ కూడా వస్తుంది. నేను కూడా నా భర్తతో కలిసి నాలుగేళ్లు కశ్మీర్‌లోనే ఉన్నాను. పిల్లల చదువుల కోసం స్వగ్రామానికి వచ్చేశాను. నాలుగైదు రోజులకోసారి ఆయన నాతో ఫోన్‌లో మాట్లాడుతుంటాడు. నన్ను ఫోన్ చేయవద్దంటాడు ఆయనే నాకు ఫోన్ చేస్తాడు. వాట్సాప్ కాల్, వీడియో కాల్ చేయమంటే అలా చేయకూడదని వాయిస్ కాల్ చేస్తుంటాడు. పాకిస్థాన్‌తో యుద్ధం సన్నాహాలు మొదలైన తరువాత కూడా రెండు రోజులకోసారి ఫోన్ చేసి 'నువ్వు భయపడవద్దు. మన భారతీయులను పాక్ సైన్యం ఏం చేయలేరని ధైర్యం చెబుతుంటాడు. ఉగ్రదాడిలో అమాయకులను పొట్టన పెట్టుకోవడం దారుణం. ఆ తర్వాత మన సైన్యం ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడం ఆనందంగా ఉంది. దేశ ప్రజల రక్షణ కోసం నా భర్త యుద్ధం చేయడం గర్వంగా ఉన్నా మరోపక్క భయంగా కూడా ఉంది.

- ఇరపని అంజలి, వలేటివారిపాళెం

గట్టిగా బుద్ధి చెప్పాలి



కోటయ్య తలిదండ్రులు, భార్య, పిల్లలు

'మావాడు మిలటరీలో చేరి దేశానికి సేవ చేయడం, దేశ రక్షణలో పాలు పంచుకోడం చాలా గర్వంగా ఉంది. అయితే, ఇప్పుడు జరుగుతున్న యుద్ధం వల్ల కొంత భయంగానూ ఉంది.' అని లింగసముద్రంకు చెందిన జాలయ్య, ఆదిలక్ష్మి దంపతులు అన్నారు. వీరి కుమారుడు తిరుమలశెట్టి కోటయ్య అరుణాచల్‌ప్రదేశ్‌లో హవల్దార్‌గా పని చేస్తున్నారు. యుద్ధం సందర్భంగా కోటయ్య తల్లిదండ్రులతోపాటు భార్య కోటేశ్వరి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'యుద్ధం వల్ల మేము భయపడుతుంటామని కోటయ్యే ఫోన్ చేసి మాట్లాడుతుంటాడు. మా యోగక్షేమాలు అడగడంతోపాటు ధైర్యం చెబుతుంటాడు. ఈ యుద్ధంతోనైనా పాకిస్థాన్ కళ్లు తెరవాలి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలి. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులను కాల్చి చంపి, మన ఆడోళ్ల సిందూరాన్ని తుడిపేశారు. అలాంటి వారికి ఈ యుద్ధంతో గట్టిగా బుద్ధి చెప్పాలి.' అని అన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



శేషవాహనంపై ఊరేగుతున్న పెంచల నృసింహుడు

దేవతలారా తరలిరండి!

- పెంచలస్వామి ఉత్సవాలకు ఆహ్వానం
- కోనలో వేడుకగా ధ్వజారోహణం

రాపూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : దేవతలరా తరలిరండి.. శ్రీవారి ఉత్సవాలను విజయవంతం చేయండి. అంటూ సకల దేవతలకు వేద పండితులు ఆహ్వానం పలికారు. పెంచలకోన క్షేత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గరుత్మంతుడికి ప్రత్యేక పూజలు చేసి క్షేత్రోత్సవం చేశారు. ఆలయ అర్చకులు ధ్వజస్తంభానికి దర్భాలు కట్టి విశేష పూజలు చేశారు. అనంతరం గరుత్మం తుడి చిత్రాన్ని ధ్వజస్తం భంపై ఎగర వేశారు. వివిధ రకాల ద్రవ్యాలతో ఉత్సవమూర్తులను అభిషేకించారు. కాగా, గరుత్మంతుడికి పూజలు, అభిషేకం చేసిన ప్రసాదాన్ని (కొడిముద్దలు) తీసుకునేందుకు మహిళలు పోటీ పడ్డారు. అనంతరం తన దేవేరులతో కలిసి శ్రీవారు తిరుచ్చిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- శేషవాహనంపై కొలువుదీరి..

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు శుక్రవారం రాత్రి శేష వాహనంపై పెంచలస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కోన చుట్టూ మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి తదితరులు పాల్గొన్నారు.

- ఉత్సవాల్లో నేడు


బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 6 గంటలకు పూలంగి సేవ, 8 గంటలకు హంస వాహనంపై శ్రీవారు విహరిస్తారు. రాత్రి 10 గంటలకు బంగారు హనుమంతు సేవ జరగనుంది.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి : కలెక్టర్

నెల్లూరు (జడ్పీ), మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణా లను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గృహనిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన చాం బర్‌లో ఎన్టీఆర్ హౌసింగ్ పురోగతిపై సమీక్ష జరిపారు. ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆప్షన్-3 కింద లబ్ధిదారుల కోసం కాంట్రా క్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను ఇంజనీరింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిం చాలని సూచించారు. నల్లరేగడి నేలల్లో నిర్మిస్తున్న ఇళ్ల పునాదుల నాణ్య తను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తనిఖీ చేసి సర్టిఫై చేయా లన్నారు. నాణ్యత ప్రమాణాలు లేని ఇళ్లను ముందుగానే గుర్తించి, పునాదులను పటిష్ఠం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పీఎంఏవై - ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నూతన ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల ఎస్ఈలు గంగాధర్, వెంకట రమణ, విజయన్, అశోక్‌కుమార్, డీఈలు జహీరుద్దీన్, నారాయణరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

డెల్టాకు 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల

అనంతసాగరం మే 9 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి శుక్రవారం 4వేల క్యూసెక్కుల నీటిని పెన్నా డెల్టాకు విడుదల చేశారు. డ్యాంలోని 6వ క్రస్ట్‌గేట్ నుంచి 2,800, పవర్‌ప్లాంట్ కెనాల్ నుంచి 1,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 50.425 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు ఇస్తున్నట్లు వివరించారు.



ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ..

నెల్లూరులో ఎఫ్‌ఎఫ్‌సీ

ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ పార్క్..... దశాబ్ద కాలంగా ఎటూ తేలకుండా నానుతున్న ఈ అంశం ఎట్టకేలకు కార్యరూపానికి చేరుకుంది. అటవీశాఖతో ఏర్పడిన భూ లడాయి తేలిపోయి, 75 ఎకరాలు అప్పగించడంతో పారిశ్రామిక పార్కు పురుడుపోసుకోనుంది. ఇదే సమయంలో నెల్లూరు నగరంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భగత్‌సింగ్ కాలనీలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ రూపుదిద్దుకోనుంది. ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు తగినంత భూమి లేక పోవడంతో కాంప్లెక్స్ నిర్మాణానికి పాలకులు నిర్ణయించారు. ఈ రెండింటికీ నేడు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఇటు నగరంలో ఎఫ్‌ఎఫ్‌సీ, అటు నగర శివార్లకు అనుకుని ఉన్న ఆమంచర్లలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు పూర్తయితే ఎంతో మంది ఉపాధి లభిస్తుంది.

- రూరల్, సిటీ నియోజకవర్గాల్లో ఏర్పాటు
- రెండింటికీ నేడు శంకుస్థాపన
- రూ.19 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆమంచర్లలో 75 ఎకరాలు అప్పగించిన అటవీ శాఖ
- మొదటి విడతలో 30 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్
- ఔత్సాహికుల కోసం 313 ప్లాట్లు సిద్ధం
- మౌలిక సదుపాయల కల్పన తర్వాత ధర నిర్ణయం
- భగత్‌సింగ్ కాలనీలో 2.4 ఎకరాల్లో కాంప్లెక్స్



ఆమంచర్ల వద్ద ఎంఎస్ఎంఈ పార్క్ స్థలంలో శంకుస్థాపనకు సిద్ధం చేస్తున్న సిబ్బంది



భగత్‌సింగ్‌కాలనీ వద్ద ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణానికి సిద్ధమవుతున్న భూమి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగా ఇటీవలే ఆత్మకూరు నియోజకవర్గంలోని నారంపేట ఎంఎస్ఎంఈ పార్క్‌ను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన విషయం తెలిసిందే. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ఏపీఐఐసీ ఆధ్వ ర్యంలో అన్నీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ల కోసం భూములను గుర్తించారు. ఈ క్రమంలో శనివారం నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌లకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూరల్ నియోజకవర్గంలోని ఆమంచర్ల ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని దాదాపు పదేళ్ల క్రితమే ఏపీఐఐసీ భూమిని కొనుగోలు చేసింది. అయితే ఆ భూమి తమదని అటవీశాఖ అడ్డుపడింది. అప్పటి నుంచి ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ పార్క్ కలగా మిగిలిపోయింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డిశ్రీధర్‌రెడ్డి పట్టు వదలకుండా ఆ పార్క్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికి ఆ కల నెరవేరనుంది.

- ఆమంచర్లలో 75 ఎకరాల భూమి కేటాయింపు

ఆమంచర్ల ప్రాంతం నెల్లూరు నగరానికి దగ్గరగా ఉండటం, ప్రస్తుతం నగరంలో ఉన్న ఆటోనగర్‌లో కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో అనేక మంది ఆటోనగర్ పారిశ్రామికవేత్తలు ఆమంచర్లలో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమంచర్ల ఎంఎస్ఎంఈ పార్క్‌కు ఎక్కడలేని డిమాండ్ ఏర్పడనున్నట్లు ఏపీఐఐసీ అధికారులు అభిప్రాయపడ్డారు. 60 ఎకరాల్లో రెండు విడతలుగా ప్లాట్లు అభివృద్ధి చేయనున్నారు. మొదటి విడతలో 30 ఎకరాల్లో 147 ప్లాట్లు, రెండవ విడతలో 30 ఎకరాల్లో 166 ప్లాట్లు సిద్ధం చేసి విక్రయించనున్నారు. మొత్తం మౌలిక సదుపాయల కల్పన తరువాత ప్లాట్ల ధర నిర్ణయించనున్నారు. మొదటి విడత పార్క్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7కోట్లు విడుదల చేసింది. పార్క్ అభివృద్ధి పనులకు శనివారం ఉదయం రూరల్ ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు.

ప్రతీ నియోజకవర్గంలో పార్క్

జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయనున్నాము. ఇప్పటికే 8 నియోజకవర్గాల్లో పార్కులకు అవసరమైన భూమిని గుర్తించాము. పలు చోట్ల మౌలిక సదుపాయాల కల్పన ప్రారంభించాము. శనివారం ఆమంచర్ల, భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాల్లో పార్క్‌లకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఎంఎస్ఎంఈ పార్కులతో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాము.

- ఎల్ శివకుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం

నగరంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

నెల్లూరు నగర నియోజకవర్గానికి సంబంధించి వెంకటేశ్వరపురం పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో 2.4 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంఎస్ఎంఈ పార్క్ కోసం ఏపీఐఐసీకి అప్పగించారు. అయితే ఈ భూమిలో ప్లాట్లకు బదులు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)ని జీ+2గా నిర్మించనున్నారు. ఇక్కడి దుకాణాలను యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించనున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, కాంప్లెక్స్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు శనివారం సాయంత్రం రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ శంకుస్థాపన చేయన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9285
వెండి కిలో ధర	రూ. 98.700
వెండి ఒక గ్రాము	రూ.101.70

17న లక్ష్మీనృసింహుడి జయంత్యుత్సవాలు

వలేటివారిపాలెం: మాలకొండ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీన జయంత్యుత్సవాలు జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరిశీలించారు. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి 50వేలకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల సమీక్షించారు. ఆలయ డీసీ కేవీ సాగర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు మల్లేశ్వరరావు, లక్ష్మీనరసింహం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కంప్యూటర్ యూపీఎస్ వితరణ

కందుకూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు విర్కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.90 వేల విలువ చేసే కంప్యూటర్లకు చెందిన యూపీఎస్, బ్యాటరీలు వితరణ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విర్కో ఫౌండేషన్ యాజమాన్యానికి, సహకరించిన శ్రీరామ చంద్రరావు, విశ్రాంత హెచ్ఎం మల్లికార్జునరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీ రుణాల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

వలేటివారిపాలెం, మే 9(ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ స్టేట్‌బ్యాంక్ సిబ్బందిని కోరారు. పోకూరు సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం బ్యాంక్ సిబ్బందితో సమావేశమయ్యారు. అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు డీపీవోకి ఫిర్యాదు చేశానన్నారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

లింగసముద్రం, మే 9(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలు సీహెచ్ రమాదేవి, సీహెచ్ ప్రభావతి, సరోజిని పాల్గొన్నారు.

భూముల వివరాలు పరిశీలించుకోండి

వలేటవారిపాలెం, మే 9(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తమ భూముల వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి ఈనెల 20వ తేది లోపు ఆన్‌లైన్‌లో సరిశీలించుకోవాలని ఏవో హేమంత్‌భరత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు తమ ఆధార్‌కార్డు, భూముల వివరాలతో ఆర్‌సీకేల్లో సంప్రదించాలని తెలిపారు.

తోట వెంకటేశ్వర్లుకు సత్కారం

కావలిటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ నూతన సభ్యత్వ నమోదులో 93 సభ్యత్వాలు చేయించడమేకాక జేవీవీ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన జేవీవీ కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లును శుక్రవారం రెడ్‌క్రాస్ భవనంలో ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు ప్రతిభా పురస్కారం అందజేసి సత్కరించారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ : ఇంటూరి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కందుకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది కందుకూరుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన దూబగుంట నుంచి కోవూరు గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేశారని, టెండర్లు పిలవడం కూడా జరిగిందని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ రహదారుల పనుల కోసం రూ.3 కోట్లు నాబార్డు నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. 160 బీ హైవేపై ప్రమాదాలు నివారణకు కందుకూరు పోలీసులు, ఆర్డీవో, హైవే అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. అనంతరం వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేయించుకొని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నియోజకవర్గంలోని 37 మందికి మంజూరైన రూ.42,40,021 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

సర్ హెన్రీ డునాంట్ చూపిన బాటలో నడుద్దాం


డునాంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాధ్యులు

కావలి, మే 9(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకుడు సర్ హెన్రీ డునాంట్ చూపిన మానవత్వపు బాటలో నడుద్దామని కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో శుక్రవారం సాయంత్రం సర్‌హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రపంచ రెడ్‌క్రాస్ వారోత్సవాలను ఆర్డీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందటం విశేషమన్నారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఖాజీ డాక్టర్ ముక్తీ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. వ్యాపార వేత్త బచ్చు వీరాస్వామి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ రక్తకేంద్రం ఏర్పాటుకు తాను తన మిత్రుడు నేరెళ్ల జ్వాలరావు 20 ఏళ్ల కిందట తొలివిరాళం అందచేశామన్నారు. రక్తనిధి భవనంపై నిర్మించనున్న మొదటి అంతస్తుకు రూ.15 లక్షలు విరాళం అందచేస్తానని ప్రకటించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డి. రవిప్రకాష్ మాట్లాడుతూ వారం రోజుల పాటు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు కే.హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు, డాక్టర్ పాములూరు శ్రీధర్, ఇలింద్ర వాణి, అంకినపల్లి రమేష్‌రెడ్డి, మోడరన్ నరసింహారావు, గొట్టిపాటి మనోరమ, ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కావలి రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చోరీ చేశాడని అనుమానించి అడిగినందుకు కత్తితో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కొండాపురం మండలం సత్యవోలుకు చెందిన చావా రమేష్, మహేశ్వరి దంపతులు కావలి మండలం రాజువారిచింతలపాలెం శివారులో టిఫిన్, బిర్యాని సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం అక్కడ వంట మాస్టర్లుగా పనిచేసే కొంకా సుబ్బారావు, పోకూరు ప్రసాద్‌ల సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. దీంతో పక్కనే ఉన్న మామిడి తోటలో పనిచేస్తున్న సూర్యపై వారు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో రమేష్ సూర్య వద్దకు వెళ్లి సెల్‌ఫోన్ల గురించి అడగడంతో నన్నే అనుమానిస్తావా అంటూ తన వద్ద ఉన్న కత్తితో రమేష్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు రమేష్ భార్య శుక్రవారం ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏజీపీగా సీనియర్ న్యాయవాది బెజవాడ


బెజవాడ కృష్ణయ్య

కందుకూరు, మే 9(ఆంధ్రజ్యోతి) : కందుకూరు సబ్ కోర్టు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా కందుకూరు సీనియర్ న్యాయవాది బెజవాడ కృష్ణయ్య నియమితులయ్యారు. ఈయన మూడేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనను ఏజీపీగా నియమించేందుకు సహకరించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని శుక్రవారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. తోటి న్యాయవాదులు, స్నేహితులు, స్థానికులు కృష్ణయ్యకు అభినందనలు తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

కావలి రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఉదయగిరి బ్రిడ్జిపై గత నెల 30వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తల్లపనేని వేమయ్య(62) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చలంచర్లకు చెందిన వేమయ్య కొంత కాలంగా పట్టణంలోని మున్సిపల్ ప్లాట్లల్లో నివశిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి మోటారుసైకిల్‌పై ఇంటికి వెళుతుండగా బ్రిడ్జిపై ఎదురెదురుగా వస్తున్న మరో బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వేమయ్యకు తీవ్ర గాయాలు కావడంతో నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన మృతితో చలంచర్లలో విషాదచాయలు అలుముకున్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత : డీఏవో


పరికరాలు అందజేస్తున్న డీఏవో సత్యవాణి

బిట్రగుంట, మే 9(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రాయితీపై రుణాలు, వ్యవసాయ పనిముట్లను అందచేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారిని పుట్టా సత్యవాణి అన్నారు. బోగోలు మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 50 శాతం రాయితీపై మంజూరైన వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పరికరాలు అందజేశారు. అన్నదాత సుఖీభవ విధి విధానాలు, మట్టినమూనా పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కావలి వ్యవసాయ సహాయక సంచాలకులు సీహెచ్.నాగరాజు, జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి, టీడీపీ నేతలు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లురెడ్డి, మాధవ రావు, వెంకటేశ్వర్లు, వెంకారెడ్డి, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పుష్కలంగా తాగునీటి సరఫరా

అల్లూరు, మే 9(ఆంధ్రజ్యోతి): అల్లూరు నగర పంచాయతీ, సింగపేట, ఇస్కపల్లి ప్రాంతాలకు మరో రెండు, మూడు రోజుల్లో సురక్షిత తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలీ ప్రకాష్ అన్నారు. అల్లూరు చెర్లో సంఘం ప్రాంతంలోని తాగునీటి పైలెట్ ప్రాజెక్టును ఆయన స్థానిక నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకుల సహకారంతో నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఈ ప్రాజెక్టుకు నిధులు తెచ్చుకొని మండలంలోని ఏడు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశామన్నారు. గత ఐదేళ్లుగా నిర్వహణా లోపంతో మిషనరీ దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు పడ్డామని అన్నింటికీ మరమ్మతులు చేపట్టామని, త్వరలో తాగునీటిని విడుదల చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, మునిరాజా, కావలి జగన్ పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'లో అన్ని సమస్యలకు పరిష్కారం


అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

అల్లూరు, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కావలి ఆర్డీవో వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ స్థానిక రైతుల భూ సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. అత్యధికంగా గోగులపల్లి రెవెన్యూ పరిధిలో రీ సర్వేలో చోటుచేసుకున్న వేలాది సమస్యలను తెలియజేశారు. దీనిపై తహసీల్దారు లక్ష్మీనారాయణను ఆర్డీవో వివరణ అడిగారు. ఈ సమస్యలను పరిశీలిస్తున్నామని తహసీల్దారు వివరించారు.

వైభవంగా రామాలయాల వార్షికోత్సవాలు

కొండాపురం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి, మర్రిగుంట, గుడవళ్లూరు పంచాయతీ పెద్దూరు రామాలయాల్లో శుక్రవారం ఆలయాల వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన పండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

అల్లూరు, మే 9(ఆంధ్రజ్యోతి): అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సచివాలయ అధికారులు, సిబ్బందికి సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ సూచించారు. అల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన నగర పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా తాగునీటి సమస్యలపై అధికారులను వివరణ కోరారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, స్థానిక నాయకులు, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, రేబాల శంకర్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నాలపరెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోకుంటే నిధులు ఇచ్చేయండి

● లబ్ధిదారులకు నోటీసులు

అల్లూరు, మే 9(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో బిల్లులు అందక ఆగిన ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల్లో కొంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగా ఇళ్లను నిర్మించుకోకుంటే నిధులు వెనక్కి ఇచ్చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మండలంలోని ఇస్కపల్లి బీఎంఆర్ గిరిజన కాలనీలో ఆయన అదనపు బిల్లులు తీసుకొని ఇళ్ల నిర్మాణం పూర్తిచేయని లబ్ధిదారులకు శుక్రవారం నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో గృహాలు నిర్మాణాలు పూర్తి చేయాలని లేనిపక్షంలో అదనంగా చెల్లించిన ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని తెలిపారు. ఈ నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేసుకొని జూన్‌లో గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

అల్లూరు, మే 9(ఆంధ్రజ్యోతి) : అల్లూరు, నార్తుమోపూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శానివారం అల్లూరుతో పాటు నార్తుమోపూరు, బీరంగుంట, నార్తుఆములూరు, గ్రద్దగుంట, బట్రకాగొల్లు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నాని అల్లూరు ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ శ్రీపూజ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడుతూ ప్రజలు, రైతుల నుంచి వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు మండల, గ్రామస్థాయి అధికారులు సమగ్రంగా విచారించి పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించాలని తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎస్ఐ రఘునాథ్, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి పాల్గొన్నారు.

అసత్య ప్రచారం తగదు : గురజాల

వింజమూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): తాము భూమి దురాక్రమణ చేయలేదని, డీఫారమ్ పట్టా పొంది ఉన్నామని, అసత్య ప్రచారం చేయడం తగదని మాజీ ఎంపీటీసీ సభ్యుడు గురజాల వెంకటరమణయ్య పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో శుక్రవారం ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 1968లో 244/1 నాలుగు ఎకరాల ఐదు సెంట్లు భూమి గురజాల వెంకటరమణయ్య పేరు మీద, 245/1 నాలుగు ఎకరాల 20 సెంట్లు భూమి గురజాల సుబ్బారావు పేరుమీద, 245/2 నాలుగు ఎకరాల 16 సెంట్లు భూమి మంచు రాఘురామయ్య పేరు మీద అప్పటి ఉదయగిరి తహసీల్దారు డీ పార్మమ్ పట్టా ఇచ్చారని పట్టా కాగితాన్ని చూపించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 12 ఎకరాల 41సెంట్లు పొలం మా ముగ్గురి సాగులోనే ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి తహసీల్దారు వైసీపీ ప్రభుత్వం ఒత్తిడితో భూ దురాక్రమణ చట్టం 1905 ప్రకారం 21-01-2022 జనవరిలో రద్దు చేశారన్నారు. ఈ విషయం ఆర్డీవోకి విన్నవించగా తహసీల్దారు ఇచ్చిన ఆర్డర్‌ను కొట్టివేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అధికారులు రికార్డులలో నమోదు చేయలేదన్నారు. ఈ విషయంపై అనేక పర్యాయాలు, రెవెన్యూ సదస్సుల్లో, గ్రీవెన్స్‌డేలో అర్జీలు ఇచ్చాన్నారు. అయినప్పటికీ జిల్లా అధికారులు, మండల రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. కనుక అధికారులు, నాయకులు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

వింజమూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగొండ్ల గ్రామంలోని హరిహర క్షేత్రం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఎల్సీ కొండారెడ్డి, ఈవో శాంతయ్య తెలిపారు. శనివారం ధ్వజారోహణం, 11న హనుమంతసేవ, 12న బంగారు గరుడసేవ, 13న గజోత్సవం, 14న కల్యాణం, 15న, అలకలతోపు, 16న వసంతోత్సవం, 17న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

ఈదురుగాలులతో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

ఉదయగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు రాత్రి వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. వర్షానికి ముందు ఈదురుగాలులు వీయడంతో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. ఉద్యాన పంటల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గిన అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో మెయిన్‌బజార్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి నిప్పులు చెలరేగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పలు నివాసాల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.

చంద్రబాబు సారథ్యంలో అన్నిరంగాల్లో అభివృద్ధి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని, వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేశారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య తన అనుచరులు 250 కుటుంబాలతో కలిసి వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీలో వ్యక్తిగత అజెండా ఉండదని, పార్టీ అజెండాతోనే ముందుకు నడవాలన్నారు. టీడీపీలో చేరిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులను ఇబ్బంది పెట్టినవారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్లు బయ్యన్న, మధు, గండిపాళెం జలాశయం చైర్మన్ వెంకట సుబ్బయ్య, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సాయి, ఏ వెంకటేశ్వర్లు, ఆర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విఠలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విఠలేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

సీతారామపురం, మే 9 (ఆంధ్రజ్యోతి) స్థానిక పంచాయతీ పరిధిలోని పంద్రంగి గ్రామం వద్ద ఉన్న పాండురంగ విఠలేశ్వర స్వామి ఉత్సవాలు శుక్రవారం అట్టహాసంగా పారంభమయ్యాయి. ఈనెల 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవాల కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హనుమంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు దాతల సహాయంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా సీతారాముల వసంతోత్సవం

ఉదయగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు స్వామివార్లకు వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కందుకూరులో దొంగల హల్‌చల్

● ఒకేరోజు మూడిళ్లలో చోరీ ● వరుస ఘటనలతో ప్రజల బెంబేలు


సింహాద్రి నగర్‌లో దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, పోలీస్ అధికారులు

కందుకూరు, మే 9(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా కందుకూరు పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఒకే రోజు మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి దొరికినకాడికి దోచుకెళ్లారు. దీంతో ప్రజలు బెంబేలెత్తు తున్నారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వాసవీ గ్రంథాలయం సమీపంలో నివాసం ఉండే పసుపులేటి రాజేశ్వరి గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి ఉండగా గుర్తించిన దొంగలు ఇంటి తలుపు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి బెడ్‌రూంలోని బీరువా పగలగొట్టి అందులో ఉన్న రూ.35,000 అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన రాజేశ్వరి ఇంట్లో దొంగలు పడ్డ విషయాన్ని గుర్తించి లబోదిబోమన్నారు. 10 సవర్ల బంగారం రూ.35000 అపహరించుకెళ్లారని వాపోయారు. అయితే పోలీస్ తనిఖీల్లో చీరల లోపల పెట్టిన బంగారం దొంగల కంటపడకుండా భద్రంగా ఉండడాన్ని గమనించారు. అలాగే నాంచారమ్మ కాలనీలో నివాసం ఉండే మరో కుటుంబం ఇంటికి తాళం వేసి బెంగళూరులోని తన కుమాడి వద్దకు వెళ్లగా గుర్తించిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళం పగలగొట్టిన విషయం గమనించిన చుట్టుపక్కలవారు బెంగళూరులోని ఇంటి యజమానులకు సమాచారం అందించడంతో వారి ఫిర్యాదుతో పోలీసులు వచ్చి పరిశీలించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించారు. అదే సమయంలో బెంగళూరు నుంచి వచ్చిన బాధితులు ఇంట్లో పరిశీలించుకుని బీరువాలో ఉన్న 13 సవర్ల బంగారం అపహరించుకెళ్లినట్లు నిర్ధారించారు. అలాగే పట్టణంలోని సింహాద్రి నగర్‌లో నివాసం ఉండే దివంగత ఉపాధ్యాయుడు కాట వెంకటేశ్వర్లు ఇంట్లోను దొంగలు పడ్డారు. వెంకటేశ్వర్లు సతీమణి ఇంటికి తాళం వేసుకుని తన కుమా ర్తె వద్దకు వెళ్లగా దొంగలు ప్రధాన ద్వారం తాళం విడదీయడంతోపాటు రెండు బెడ్‌రూమ్‌లు, బీరువాకు వేసి ఉన్న తాళాలను కూడా పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంట్లో అర్ధరాత్రి సమయం లో లైట్లు వెలిగి ఉండటం గమనించిన చుట్టుప క్కలవారు ఎవరు లేకుండా లైట్లు ఎలా వెలుగుతున్నాయని పరిశీలించగా తలుపులన్నీ పగలగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్ధరాత్రి సమయంలో పోలీసులు వచ్చి పరిశీలించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించారు. అయితే ఇంటి యజమానులు అందుబాటులో లేకపోవడంతో ఆ ఇంట్లో దొంగలు ఏమి ఎత్తుకెళ్లారనేది తెలియాల్సి ఉంది.

● పట్టణంలోని మూడుచోట్ల ఒకేరోజు దొంగతనాలు జరగడంతో అప్రమత్తమైన డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్‌లు ఆ నివాసాలను పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం క్లూస్ టీమ్ అధికారి బ్రహ్మయ్య, ఇతర సిబ్బంది ఆయా గృహాల్లో వేలిముద్రలు సేకరించారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

ఏఎస్ పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అనర్థ దాయకం అని జిసిడిఎస్ సూపర్‌వైజర్ పి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్య వివాహాలు, బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహలతో నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజిత, ఎంపిహెచ్ఎ దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగవరపమ్మ, పోలేరమ్మ జాతర

సంగం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్లలో ఉన్న నాగవరపమ్మ, పోలేరమ్మ మహాకుంభాబిషేక జాతర మహోత్సవం శనివారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజతో జాతర ప్రారంభమవుతుందన్నారు. 11న మహాగణపతి పూజ, హోమం, పూర్ణాహుతి, 12న మహాకుంభాబిషేకం, 13న గ్రామపొంగళ్లు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

12 నుంచి ఆధార్ శిబిరాలు

సంగం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సచివాలయాల్లో ఈ నెల 12 తేదీ నుంచి ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షాలెట్ ఒక ప్రకటనలో తెలిపారు. 12, 13 తేదీల్లో పడమటిపాళెం, వంగల్లు, తరుణవాయి సచివాలయాల్లో, 14, 15 తేదీల్లో దువ్వూరు, మర్రిపాడు, పెరమన సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. 0-6 ఏళ్ల లోపు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు, మిస్సింగ్ బయోమెట్రిక్ అప్‌డేషన్, 5-15 ఏళ్లు పైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, చిలకలమర్రి, అనంతసాగరం, సోమశిల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు 33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. త్రీఫేస్ ఉదయం 6 నుంచి 9 గంటలకు ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.